జగనన్నా.. స్వచ్ఛ జలం ఏదన్నా..?

● జలజీవన్ మిషన్ పనులకు ముందుకు రాని కాంట్రాక్టర్లు ● కమిటీల పేరుతో కాలయాపన ● ఐదేళ్లవుతున్నా పూర్తికాని పనులు

గ్రామీణ ప్రాంతంలో గడప గడపకు జలజీవన్ మిషన్ ప్రాజెక్టుతో స్వచ్ఛ జలం అందిస్తానని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డప్పు కొట్టారు. కానీ ఆచరణలో సాధ్యం కాలేదు. ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇచ్చి రోజుకు ఒక్కొక్కరికి 55 లీటర్ల సురక్షిత తాగునీరు అందించేందుకు ప్రవేశపెట్టిన ఈ పథకం నీరుగారుతోంది. ఐదేళ్లు అవుతున్నా ఇప్పటికీ గడప గడపకు సురక్షిత నీరు అందలేదు. 2024 మార్చి నాటికి వందశాతం పూర్తి చేస్తామన్న ప్రభుత్వం చేతులెత్తేసింది. కమిటీల పేరుతో కాలయాపన చేయడం తప్ప చేసిందేమీ లేదనే విమర్శలున్నాయి.


శెట్టిపల్లెలో నిరుపయోగంగా ఉపరితల నీటి ట్యాంకు


రెడ్డివారిపల్లె పంచాయతీలో రోడ్డువార వడ్డెపల్లె వద్ద బోరు వేసి వదిలేసిన దృశ్యం

సంబేపల్లె, ఫిబ్రవరి 23: గ్రామీణ ప్రాంతాల్లో వేసవిలో భూగర్భజలం అడుగంటి తాగునీటి బోర్లలో నీరు రాక ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఇది అరికట్టేందుకు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ పర్యవేక్షణలో అప్పట్లో గ్రామ సర్పంచ్, పంచాయతీ సెక్రటరీ, ఆరోగ్య కార్యకర్త, అంగన్వాడీ టీచర్, ఐదు మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసి నిధులను మంజూరు చేసేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేశారు. అయితే ఈ పనులు చేసేందుకు సంబంధిత కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం విశేషం. మంజూరైన పనులు జరగక అలాగే వదిలేశారు. ప్రస్తుతం జలజీవన్ మిషన్ ప్రాజెక్టు స్వయం సహాయక సంఘం కమిటీ 11 మంది సభ్యులతో కలిసి పంచాయతీ సెక్రటరీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఎస్‌హెచ్‌జీ మహిళలతో కమిటీ ఏర్పాటు చేశారు. మార్చి 2024 లోపు వందశాతం గడప గడపకు సురక్షిత నీరు అందించాలని, కొత్త కమిటీలకు సిఫారసు చేశారు. కానీ మార్చి వస్తున్నా ఇప్పటి వరకు పనుల్లో పురోగతి లేదు. ఈ ప్రభుత్వంలో గడప గడపకు జలం మాట దేవుడెరుగు.. ఉన్న నీటి పథకాల మరమ్మతులకు నిధులు లేవని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత తాగునీటి పరిష్కారం చూపేందుకు ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, గ్రామ పంచాయతీలో కనీసం మరమ్మతులకు నిధులు లేక సర్పంచులు చేతులెత్తేసినట్లు చెబుతున్నారు.

కమిటీలతో కాలయాపన

గడప గడపకు సురక్షిత నీరు ప్రాజెక్టుతో జలజీవన్ మిషన్ పనులను చేపట్టేందుకు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ పర్యవేక్షణలో ఐదు మంది కమిటీ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఆరోగ్య కార్యకర్త, అంగన్వాడీ టీచర్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం గ్రామ జలసంఘం కమిటీ పేరుతో స్వయం సహాయక సంఘం మహిళలతో కొత్త కమిటీలను ఏర్పాటు చేశారు. 9 మంది ఎస్‌హెచ్‌జీ మహిళలు, పంచాయతీ సెక్రటరీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కలిపి కొత్త కమిటీలను ఏర్పాటు చేసి బ్యాంకు ఖాతాలను కొత్తగా తెరిచారు. గ్రామీణ ప్రాంతాల్లో గడప గడపకు కుళాయి ట్యాప్ ఏర్పాటుకు పనులు చేపట్టేందుకు కమిటీ సిద్ధం చేశారు. మార్చి వస్తున్నా ఇప్పటి వరకు నిధుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి.

● రాయచోటి నియోజకవర్గంలో జలజీవన్ మిషన్ కింద ఫేస్-1, ఫేస్-2 కింద మండలాలకు మంజూరైన పనులు, నిధుల వివరాలు ఇలా..

ఫేస్-1లో:

సంబేపల్లె మండలానికి 206 పనులకు రూ.2.83 కోట్లు, గాలివీడు మండలానికి 118 పనులకు రూ.1.62 కోట్లు, లక్కిరెడ్డిపల్లె మండలానికి 139 పనులకు రూ.1.85 కోట్లు, రామాపురం మండలానికి 101 పనులకు గానూ రూ.1.54 కోట్లు, చిన్నమండెం మండలానికి 128 పనులకు గానూ రూ.1.79 కోట్లు, రాయచోటి మండలానికి 118 పనులకు గానూ రూ.1.98 కోట్లు.

ఫేస్-2లో:

సంబేపల్లె మండలానికి 119 పనులకు గానూ రూ.10.56 కోట్లు, గాలివీడు మండలానికి 126 పనులకు రూ.12.91 కోట్లు, లక్కిరెడ్డిపల్లె మండలానికి 114 పనులకు గానూ రూ.6.54 కోట్లు, రామాపురం మండలానికి 119 పనులకు గానూ రూ.10.10 కోట్లు, చిన్నమండెం మండలానికి 128 పనులకు గానూ రూ.7.93 కోట్లు, రాయచోటి మండలానికి 118 పనులకు గానూ రూ.9.71 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పడం తప్ప నిధులు లేక ఇప్పటి వరకు పనులు చేపట్టలేదు.

ఎన్నికలు వస్తున్నాయి.. ఇంకేం చేస్తారు..



గడప గడపకు కుళాయి, ట్యాప్ బిగించి సురక్షిత నీరు ఇస్తామన్నారు. ఎన్నికలు వస్తున్నాయి. ఇప్పటి వరకు పనులే చేయలేదు. ఇంకేం బిగిస్తారు. పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రాక కమిటీలు పెట్టి కాలయాపన చేశారు. ఈ ప్రభుత్వంలో స్వచ్ఛ జలం అందడం సాధ్యం కాదు.

- సహదేవ, పెద్దజంగంపల్లె, దుద్యాల గ్రామం

మరమ్మతులకు డబ్బులు లేవు..



గడప గడపకు స్వచ్ఛ జలం మాట పక్కన పెడితే గ్రామాల్లో చెడిపోయిన నీటి పథకాలకు మరమ్మతులకు కూడా పంచాయతీలో నిధులు లేవు. వేసవి వస్తోంది. పల్లెల్లో తాగునీటి సమస్యలు ఎక్కువ అవుతాయి. ఈ ఏడాది వేసవి నుంచి బయట పడడం గగనమే.

- ఎద్దుల లక్ష్మిదేవి, సర్పంచ్, దుద్యాల

కమిటీలు వేశాం.. నిధులు ఇంకా వేయలేదు



సంబేపల్లె మండల వ్యాప్తంగా గ్రామాల్లో గడప గడపకు స్వచ్ఛ జలం అందించేందుకు 9 మంది ఎస్‌హెచ్‌జీ మహిళలతో పాటు పంచాయతీ సెక్రటరీ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌తో కలిసి 31 కమిటీలు ఏర్పాటు చేశాం. బ్యాంకు ఖాతాలు తెరిచాం. నిధులు వేస్తామన్నారు. ఇప్పటి వరకు నిధులు అయితే రాలేదు.

- సంజీవరాజు, ఏపీఎం, సంబేపల్లె

పీలేరులో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకులు



వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

● 'లిప్' రాష్ట్ర పరిశీలకుల బృందం

పీలేరు, ఫిబ్రవరి 23: చదువుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (లిప్) రాష్ట్ర పరిశీలకుల బృందం పీలేరులోని ఉపాధ్యాయులకు సూచించింది. 'లిప్' కార్యక్రమం అమలు తీరుతెన్నుల పరిశీలనలో భాగంగా రాష్ట్ర పరిశీలన బృందం శుక్రవారం పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించింది. ఈ సందర్భంగా బృంద నాయకుడు, అనంతపురం జిల్లాలోని బుక్కపట్నం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డా.రామకృష్ణ ఉపాధ్యాయులతో మాట్లాడుతూ 6, 7, 8 తరగతుల విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం 'లిప్' కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి వారిని నిష్ణాతులుగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు తరగతి గదుల్లో తాము నేర్చుకున్న అంశాలను ఏ విధంగా అమలు చేస్తున్నారో తాము రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి పరిశీలిస్తున్నట్లు తెలిపారు. పాఠ్యాంశాలతో పాటు పర్యావరణం, చిత్రలేఖనం, చేతిరాత అంశాలలో కూడా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడడంతో పాటు పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బృంద సభ్యులు కె.రాజేంద్రప్రసాద్, జీసీ నాగప్ప, బాబా సాహెబ్, ఎంఈవోలు లోకేశ్వరరెడ్డి, పద్మావతమ్మ, హెచ్‌ఎం నటరాజన్, ఉపాధ్యాయులు శిరీష, శశిదేవి, వెంకటరామయ్య, లీలావతి, మోదీన్ బాషా, రమణారెడ్డి, షరీఫున్నిసా, సీఆర్‌పీ మురళీధర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

డబ్బు ప్రవాహాన్ని అరికట్టాలి

● జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 23: రాబోవు ఎన్నికల సమయంలో డబ్బు ప్రవాహాన్ని నిఘా చర్యలతో అరికట్టాలని పోలీసు శాఖను, ఎన్‌ఫోర్స్‌మెంటు ఏజెన్సీలను, అటవీశాఖ అధికారులను జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో 2024 ఎన్నికల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వచ్చే సాధారణ ఎన్నికల్లో డబ్బు ప్రవాహం ఎక్కువగా జరిగే అవకాశం ఉందని, పోలీసు శాఖ అన్నిరకాల చర్యలు తీసుకోవాలని వారు ఆదేశించారు. అవసరమైన సిబ్బంది లేకపోతే ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, సీఆర్పీఎఫ్ తదితర శాఖ వారి సేవలు వాడుకోవాలని సూచించారు. సైనిక్ సంక్షేమ శాఖ నుంచి వీలైనంత మంది సేవలను ఉపయోగించుకోవాల న్నారు. ఈ సమావేశంలో ఎస్పీ కృష్ణారావు, ఏఎస్పీ రాజ్‌కమల్, డీఎఫ్‌ఓ వివేక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

కబడ్డీలో తృతీయ విజేతగా జిల్లా జట్టు

కడప (స్పోర్ట్స్), ఫిబ్రవరి 23: గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో 23 వరకు జరిగిన 33వ సబ్-జూనియర్స్ బాల, బాలికల అంతర్ జిల్లాల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలలో కడప జిల్లా బాలుర జట్టు తృతీయ విజేతగా నిలిచిందని ఆ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఓ.రవీంద్రరెడ్డి, ఆర్.వెంకటసుబ్బయ్య వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా జట్టులోని సంతోష్ (సి) బ్రహ్మయ్య, నూర్‌బాష, దశరథ్, బాలాజి, వంశీ, పవన్, నరేంద్ర, ఉమాశంకర్, ప్రణీత్‌కుమార్, అజయ్‌కుమార్, మద్దిలేటిస్వామిని అభినందించారు. తృతీయ స్థానం కైవసం చేసుకోవడంలో కీలకపాత్ర పోషించిన కడప డీఎస్‌ఏ కబడ్డీ కోచ్ ఆర్వీ శ్రీధర్‌ను అలాగే జిల్లా జట్టు క్రీడాకారులను అభినందించారు.


పీలేరు మార్కెట్ కమిటీ గదులు

వేలం వాయిదా..

● వాయిదా పడిన పీలేరు మార్కెట్ కమిటీ గదుల వేలం
● ఒత్తిళ్లు తట్టుకోలేకే.. ఈ నిర్ణయం

పీలేరు, ఫిబ్రవరి 23: పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ గదుల అద్దె బహిరంగ వేలం ప్రక్రియ అర్ధాంతరంగా ఆగిపోయింది. వేలంపాట ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు యల్లయ్య శుక్రవారం సాయంత్రం ప్రకటించారు. దీంతో గత వారం రోజులుగా పీలేరులో అటు వ్యాపార, ఇటు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైన గదుల వేలం ప్రక్రియ తాత్కాలికంగా సద్దుమణిగింది. మార్కెట్ కమిటీ గదులు తమకు కావాలంటే తమకే కావాలంటూ అధికార పార్టీలోనే పలు గ్రూపులు తయారు కావడంతో ఎన్నికల ముందు తలనొప్పులు ఎందుకని వేలం ప్రక్రియను పీలేరు వైసీపీ అధినాయకత్వం వేయిదా వేసినట్లు సమాచారం.

ఆర్వోబీల నిర్మాణంతో పెరిగిన గిరాకీ

పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి 18 గదులున్న షాపింగ్ కాంప్లెక్స్ ఉంది. దాంతోపాటు రెండు స్టెయిర్ కేస్ రూములు, ఒక క్యాంటీన్, మూడు గోడౌన్‌లు ఉన్నాయి. వీటి అద్దెల ద్వారా మార్కెట్ కమిటీకి ప్రతి నెలా రూ.3 లక్షల ఆదాయం వస్తోంది. పీలేరు ఆర్టీసీ బస్టాండుకు సమీపంలో, పట్టణానికి ప్రధాన రహదారి అయిన ఎల్‌బీఎస్ రోడ్డుపై ఇవి ఉండడంతో వీటికి వ్యాపార వర్గాల్లో బాగా డిమాండ్ ఉంది. ఆ గదుల్లో చాలా మంది హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు గత కొన్నేళ్లుగా తమ వ్యాపారాలు సాగించుకుంటున్నారు. చాలా కాలంగా వ్యాపారులు వాటిలో స్థిరపడిపోవడంతో రెండేళ్లకు ఒకసారి మార్కెట్ కమిటీ పాలకవర్గం గదుల అద్దెలకు బహిరంగ వేలం నిర్వహించకుండా ఈ-ఆక్షన్ ద్వారా నామమాత్రంగా పెంచుతూ వారికే అద్దెకిస్తోంది. తొలిసారిగా ఈ దఫా బహిరంగ వేలం నిర్వహించేందుకు ప్రస్తుత పాలకమండలి ఈ నెల 17న ప్రకటన జారీ చేసింది. 18 గదులు, ఒక క్యాంటీన్, రెండు స్టెయిర్ కేస్ రూములు, మూడు గోడౌన్‌లకు అద్దెకివ్వనున్నట్లు ప్రకటనలో తెలిపారు. ఇదే సమయంలో అధికార పార్టీకి చెందిన చాలా మంది నాయకులు కూడా తమ ప్రాబల్యాన్ని ఉపయోగించుకుని గదులు దక్కించుకోవాలని ప్రయత్నాలు ప్రారంభించారు. గత మూడు రోజులుగా పీలేరులోనే ఉంటున్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిల దృష్టికి తీసుకెళ్లి చాలా మంది గదులు తమకు దక్కేలా చూడాలని విన్నవించుకున్నారు. పాలకవర్గం విధించిన గడువు శుక్రవారం సాయంత్రంలోపు 110 మంది డీడీలు సమర్పించారంటే వాటికి ఏర్పడిన డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చు.

ఒత్తిళ్లతో వాయిదా నిర్ణయం

బహిరంగ వేలం ద్వారా మార్కెట్ కమిటీకి ఆదాయం పెరుగుతుందని భావించిన అధికార పార్టీ అధినాయకులు, ప్రస్తుత పాలకవర్గ కమిటీ సభ్యులు గదుల కోసం ఎదురయ్యే ఒత్తిడిని అంచనా వేయలేకపోయారు. గడువు సమీపిస్తున్న కొద్దీ గదులను ఆశిస్తున్న అధికార పార్టీ నాయకుల సంఖ్య పెరగడంతో అటు అధినాయకులు, ఇటు కమిటీపై ఒత్తిడి పెరిగింది. కొంత మంది నాయకులు ఏకంగా 10 గదులకు కూడా దరావత్తులు చెల్లించడం, వాటిని ఎలాగైనా దక్కించుకోవాలని చూడడంతో అధికార పార్టీలోనే కుమ్ములాటలు మొదలయ్యాయి. గదులను దక్కించుకుని స్వంతంగా వ్యాపారాలు ప్రారంభించుకోవాలని కొందరు, గదులు దక్కించుకుని అధిక అద్దెలకు చేతులు మార్చుకోవాలని కొందరు ప్రణాళికలు రూపొందించుకోవడంతో ఎవరికి నచ్చజెప్పాలన్నా అధినాయకత్వానికి ఇబ్బందికర పరిస్థితులు ఎదురవడంతో ఎన్నికల సమయంలో అనవసర సమస్యలు ఎందుకని వారు వేలం పాటలను వాయిదా వేసేందుకు మొగ్గు చూపినట్లు తెలిసింది.

బహిరంగ వేలం ప్రక్రియ తాత్కాలిక వాయిదా..

అనివార్య కారణాల వల్ల మార్కెట్ కమిటీ గదుల వేలం ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నాం. త్వరలోనే కొత్త తేదీని ప్రకటిస్తాం.

- యల్లయ్య, చైర్మన్, పీలేరు మార్కెట్ కమిటీ

కొత్త సర్వీసుల విడుదలలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

● జిల్లా విద్యుత్‌శాఖాధికారి ఎస్.రమణ

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 23: జిల్లాలో కొత్త సర్వీసుల విడుదలలో నిర్లక్ష్యం వహిస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా విద్యుత్‌శాఖాధికారి ఎస్.రమణ తెలిపారు. శుక్రవారం కడప విద్యుత్ వినియోగదారుల సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా ఆయన తనిఖీ చేసి పరిశీలించారు. కొత్త సర్వీసును ఇతర సేవల కోసం ప్రజలు నమోదు చేసుకున్న తరువాత సంస్థ నిర్దేశించిన కాలవ్యవధిలో విడుదల చేయాలని సూచించారు. వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలపై వచ్చినప్పుడు వారికి సంతృప్తికరమైన సమాధానం ఇచ్చి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. విడుదల చేసిన కొత్త సర్వీసులను పరిశీలించి స్వయంగా వినియోగదారులకు ఫోను చేసి సంస్థ అందించిన సేవల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రేపు గ్రూప్-2 పరీక్షలు

● ఉదయం 10-30 నుంచి 1-30 వరకు పరీక్ష నిర్వహణ
● 67 పరీక్ష కేంద్రాలు.. 23,806 మంది అభ్యర్థులు : డీఆర్వో


మాట్లాడుతున్న కడప డీఆర్వో గంగాధర్‌గౌడ్

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 23: రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం నిర్వహించే గ్రూప్-2 పరీక్షలకు ఉమ్మడి కడప జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేయాలని కడప జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై రూట్ ఆఫీసర్లు, లైజాన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ 25వ తేదీ ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి 1-30 గంటల వరకు గ్రూప్-2 పరీక్షలు జరుగుతాయన్నారు. ఆబ్జెక్టివ్ పద్ధతిలో జరిగే ఈ పరీక్షలకు ఉమ్మడి జిల్లాలో 67 కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 23,806 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు అవుతున్నారన్నారు. పరీక్ష రోజు ఉదయం 9 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతిస్తామన్నారు. హాల్ టికెట్టుతో పాటు ఏదైనా గుర్తింపు కార్డుతో రావాలన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్లను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ ప్రమీల, సెక్షన్ ఆఫీసరు విజయ నిర్మల, రూట్ ఆఫీసర్లు, లైజన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

రవ్వల గుట్ట.. అక్రమాల పుట్ట..!

జిల్లా కేంద్రం ఏర్పడిన తర్వాత రవ్వలగుట్టలో అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. పలుకుబడి ఉన్న వారికి అనుమతిస్తూ, లేని వారిని సతాయిస్తూ రెవెన్యూ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గతంలో పనిచేసిన ఓ వీఆర్‌వో నిర్వాకం వల్ల ఇప్పుడు రవ్వలగుట్టలో అక్రమాలు రోజురోజుకు బయటపడుతున్నాయనే ఆరోపణలు బలంగా వినపడుతున్నాయి. ఒకే కుటుంబంలోని 10 మందికి పట్టాలు ఇవ్వడం, అందులోనూ ఒకే గ్రామానికి చెందిన వారు అయి ఉండడంతో పలు విమర్శలకు తావిస్తోంది. కొంత మంది భూకబ్జాదారులు రెవెన్యూ కార్యాలయాన్ని కేంద్రంగా చేసుకొని అధికారులకు మామూళ్లు ఇస్తుండడంతో రాత్రికి రాత్రే భవనాలు నిర్మించేందుకు అనుమతులు వస్తున్నాయని తెలుస్తోంది.

● ఒకే కుటుంబంలో 10 పట్టాలు
● ఒకే గ్రామానికి చెందిన వారిదే రాజ్యం
● రెవెన్యూలో మామూళ్ల పర్వం
● చక్రం తిప్పుతున్న ఓ కీలక ఉద్యోగి
● రంగంలోకి డివిజన్ స్థాయి అధికారులు

రవ్వలగుట్టలో దర్జాగా భవనం నిర్మిస్తున్న దృశ్యం



రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 23: ఎప్పుడో 2000 సంవత్సరంలో ఇచ్చిన పట్టాలకు ఇప్పుడు వెళ్లి పునాదులు వేస్తున్నారంటే దీని వెనకాల ఎవరు ఉన్నారో..? ఎవరు సహాయం చేస్తున్నారో...? బహిర్గతమైంది. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న ఉద్యోగి సహాయంతో వీరు మిద్దెలపైన మిద్దెలు కట్టి దర్జాగా కబ్జా చేస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. రాయచోటి మున్సిపాల్టీ 16వ వార్డుకు చెందిన రవ్వలగుట్ట సర్వే నెంబరు 574/1 అలాగే 592లో బొట్లచెరువు గ్రామంలోని బలమైన సామాజికవర్గానికి చెందిన వారికి పది మందికి పట్టాలు ఇవ్వడం అందరినీ ఆలోచనలోకి నెట్టేస్తుంది. ఈ మధ్యకాలంలో బిజిలిగుట్ట దగ్గర ఓ వ్యక్తి పునాదులు వేశాడని సోషల్ మీడియాలో రావడంతో స్వయంగా ఆర్డీవో రంగంలోకి దిగి పునాదులు పగలగొట్టిన పరిస్థితి. అయితే ఈ రవ్వలగుట్టలో రాత్రికి రాత్రే పెద్ద పెద్ద భవనాలు వెలుస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆరోపణలు ఉన్నాయి. దీని వెనక పెద్ద మొత్తంలో చేతులు మారాయా.. లేక ఏ నాయకుడు అండదండలు ఉన్నాయో అన్న అనుమానాలు ఇప్పుడు అందరినీ కలచివేస్తోంది. పలుకుబడి, పైసలున్న వారికి ఒక న్యాయం లేని వారికి మరో న్యాయమా అన్న రీతిలో అధికారుల తీరు ఉందని పలువురు అంటున్నారు.

రెవెన్యూ అధికారులపై విమర్శలు

జిల్లా కేంద్రంలో ఉన్న రెవెన్యూ అధికారులపై విమర్శలు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. పత్రికల్లో వచ్చినప్పుడు మాత్రం హంగామా చేయడం తప్ప మిగిలిన రోజుల్లో అటువైపు కన్నెత్తి కూడా చూడరనే వాదన ఉంది. సచివాలయ సిబ్బంది వచ్చాక భూ అక్రమాలు పెరగడమే కాకుండా తిలా పాపం తలా పిడికెడు అన్న చందంగా తయారైంది. రాయచోటి తహసీల్దార్‌గా వచ్చిన ప్రతిఒక్కరూ ఎంతో కొంత సొమ్ము వెనకేసుకొని వెళ్లిపోతున్నారు తప్ప భూ అక్రమాలకు అడ్డుకట్ట వెయ్యలేదని విమర్శలు వినపడుతున్నాయి. వీఆర్‌వో, వీఆర్‌ఏ స్థాయి వారు వెళ్లి ఆపడానికి ప్రయత్నం చేసినా అక్కడ నిర్మాణాలు చేస్తున్న వారు వీరిని లెక్క చేయరు. పైగా 'ఎక్కువ మాట్లాడితే.. నీ ఉద్యోగం పోతుంది జాగ్రత్త' అని బెదిరిస్తారు. కొంత మంది భూకబ్జాదారులు రెవెన్యూ కార్యాలయాన్ని కేంద్రంగా చేసుకొని మామూళ్లు ఇస్తూ రాత్రికి రాత్రే భవనాలు నిర్మిస్తున్నారు. జిల్లా కేంద్రం అయిన తర్వాత ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవడానికి జాగా లేక నానా ఇబ్బందులు పడుతుంటే భూ అక్రమార్కులు ఏకంగా భవనాలు నేర్మించడం పలు విమర్శలకు తావిస్తోంది.

ఈ విషయంపై రాయచోటి తహసీల్దార్ జయన్నను వివరణ కోరగా ఈ విషయం తనకు తెలియదని, తాను కొత్తగా వచ్చానన్నారు. ఇలాంటి సంఘటనలు ఏవైనా జరిగినట్లు తన దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు.

కట్టడి చేయాల్సిన బాధ్యత రెవెన్యూ వారిదే..



జిల్లా కేంద్రంలో భూ అక్రమాలు జరగకుండా కట్టడి చేయాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులదే. భూ అక్రమాలు చూసీ చూడనట్లు వదిలేస్తే రాబోవు రోజుల్లో ఒక్క సెంటు భూమి కూడా పట్టణ పరిసరాల్లో ఉండదు. అయినా ఒకే కుటుంబంలో పది పట్టాలు ఇవ్వడం నేనెప్పుడూ వినలేదు. రెవెన్యూ వాళ్లకు డబ్బులు ఇస్తే చాలు ఏ పనైనా అవలీలగా చేసేసి చేతులు దులుపు కుంటారు. ఈ ప్రభుత్వంలో కొత్తేమీ కాదు ఇలాంటివి. ప్రతిరోజు పేపర్లలో ఇలాంటి సంఘటనలు చూస్తూనే ఉ న్నాం. చోటామోటా నాయకులు మాటలు విని భూకబ్జా లకు పాల్పడుతున్న వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలి.

- సి.శ్రీనివాసులు, సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి

నాడు - నేడు పనులు పూర్తయ్యేదెప్పుడో!

- అసంపూర్తిగా పాఠశాలల భవన నిర్మాణ పనులు
- బిల్లులు మంజూరు కాక పనులు నిలిపివేత
- చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు... పట్టించుకోని అధికారులు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 23: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలే మారుస్తాం.. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా విద్యార్థులకు విద్యనందిస్తాం.. అంటూ పాలకులు గొప్పలు చెప్పి.. నాడు-నేడు కింద కొన్ని పాఠశాలల్లో తరగతి గదులు నిర్మాణాలు చేపట్టారు. ఆచరణలో మాత్రం ఆమేర పురోగతి కనిపించడంలేదు. విద్యార్థుల సంఖ్య ఎక్కువ ఉన్నచోట్ల అదనపు గదుల నిర్మాణానికి మౌళిక వసతుల కోసం నిధులు మంజూరు చేసినా నిర్మాణాలకు సంబంధించి 30 శాతం కూడా బిల్లులు రాకపోవడంతో అసంపూర్తిగానే మిగిలిపోయాయి.

పోరుమామిళ్ల మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో 2022 జూన్‌లో నాడు నేడు కింద అదనపు గదులు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఇయితే ఇప్పటి వరకు నిధుల లేమితో ఇప్పటి వరకు పూర్తి కాలేదు. నాడు-నేడు కింద అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు, టాయిలెట్లు, తాగునీటి పథకాలు తదితర అభివృద్ధి పనులకు సంబంధించి మొదటి, రెండో విడత కింద రూ.12కోట్లు మంజూరు కావడంతో కాంట్రాక్టర్లు పనులు మొదలు పెట్టారు. అయితే ఇప్పటి వరకు రూ.3.60 కోట్లు మాత్రమే బిల్లులు మంజూరయ్యాయి. దీంతో కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు. అప్పులు తెచ్చి ఎక్కడ పెట్టుబడి పెట్టాలి.. బిల్లులు అందిన తరువాతనే పనులు చేస్తాం అని చెబుతున్నారు. మండలంలో 38 స్కూళ్లలో 22 అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు, మౌలిక వసతులకు సంబంధించి పనులు చేపట్టారు. అయితే టాయిలెట్లు, తాగునీటి పథకాలు, వైరింగ్ లాంటి పనులకు మాత్రం బిల్లులు అందినట్లు తెలిసింది. భవన నిర్మాణాలకు బిల్లులు అందకపోవడంతో అ సంపూర్తిగా ఉండిపోయాయి. పోరుమామిళ్ల జిల్లా పరిషత్ హైస్కూలులో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు చేపట్టగా.. శ్లాబు మాత్రమే వేశారు. మిగిలిన పనులు అసంపూర్తిగా ఉన్నాయి. అలాగే వెంకటాపురంలో రెండు అదనపు తరగతి గదులకు శ్లాబు లెవల్ వరకు నిర్మాణాలు జరిగాయి. కవలకుంట్లలో అదనపు తరగతి గదులకు సైడ్ వాల్ మాత్రమే పూర్తి చేశారు. టేకూరుపేటలో 10 అదనపు తరగతి గదులు మంజూరైతే ఐదు గదులకు నిధులు మంజూరు చేశారు. ఇక్కడ సాంకేతిక సమస్య తలెత్తడంతో ఐదు అదనపు తరగతి గదులకు బేస్‌మట్టాల మేరకే వేశారు. మరో కోటి రూపాయల మేర నిర్మాణ పనులు జరగాల్సి ఉంది. గానుగపెంటలో కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో నాలుగు అదనపు తరగతి గదుల నిర్మాణాలకు నిధులు మంజూరు కాగా.. ప్రస్తుతం లెంటిల్ లెవల్ వరకు పనులు చేశారు. దాదాపు రెండేళ్లు కావస్తున్నా ఈ అదనపు తరగతి గదులకు బిల్లులు రాకపోవడంతో అసంపూర్తిగానే పనులు వదిలేశారు. మళ్లీ మన ప్రభుత్వమే వస్తుంది కదా.. బిల్లులు రాకపోతాయా అనే ధోరణిలో కాంట్రాక్టర్లు ఉన్నారు. అయితే స్కూలు కమిటీ హెడ్మాస్టర్ల ఆధ్వర్యంలో నిర్మాణాలు పూర్తి కావాల్సి ఉంది. కానీ పేరుకు మాత్రమే వారి ఆధ్వర్యంలో నిర్మాణాలు జరుగుతున్నా పెత్తనం మాత్రం అధికార పార్టీ నాయకుల చేతల్లోనే ఉందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు, విద్యాశాఖాధికారులు చొరవ తీసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు విడుదల చేయిస్తే వచ్చే విద్యాసంవత్సరానికైనా అదనపు తరగతి గదులు పూర్త య్యే అవకాశాలున్నాయి. ఈ విషయమై ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఓబయ్య ను వివరణ కోరగా.. నిధులు విడుదలైతే మిగిలిన పనులు పూర్తి చేస్తామని తెలిపారు.


టేకూరుపేట జిల్లా పరిషత్ హైస్కూలులో బేస్‌మట్టానికి పరిమితమైన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు


కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో అసంపూర్తిగా ఆగిపోయిన పనులు

వైఎస్‌ఆర్ ఏఎఫ్‌ఏయూ సెమిస్టరు పరీక్ష ఫలితాలు విడుదల

కడప (ఎర్ర ముక్కపల్లె), ఫిబ్రవరి 23: కడప నగరం డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీలో ఆర్కిటెక్చర్‌కు సంబంధించి 3, 5, 7వ సెమిస్టరు, కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌కు సంబంధించిన 1, 5 సెమిస్టరు పరీక్ష ఫలితాలను వైస్‌ఛాన్సలర్ ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రారు ప్రొఫెసరు వీసీ సురేంద్రనాధరెడ్డి విడుదల చేశారు. శుక్రవారం యూనివర్శిటీలో పరీక్షల విభాగంతో కలిసి ఫలితాలను వారు విడుదల చేశారు. అనంతరం వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ ఆర్కిటెక్చర్ మూడో సెమిస్టరు ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. అలాగే ఐదో సెమిస్టరులో 83 శాతం, 7వ సెమిస్టరులో 84 శాతం ఉత్తీర్ణత నమోదు చేసుకున్నారని తెలిపారు. కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌కు సంబంధించి మొదటి సెమిస్టరు పరీక్షలో 83 శాతం, ఐదో సెమిస్టరులో 89 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత పొందినట్లు తెలిపారు. పరీక్ష ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో పొందపరిచామన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వై.పవన్‌కుమార్‌రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సుప్రియ, పరీక్షల నియంత్రణ సహాయ అధికారి ఉదయ్ ప్రకాశ్‌రెడ్డి, లక్ష్మి ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.


ఫలితాలు విడుదల చేస్తున్న వైస్‌చాన్సలర్, రిజిస్ట్రార్

'ప్రజాస్వామ్యానికి పాతరేస్తున్న ఈవీఎంలు'

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 23: రెండు పర్యాయాలు ఈవీఎంల పుణ్యమా అని బీజేపీ అధికారంలోకి వచ్చిందని, ప్రజాస్వామ్యానికి పాతరేస్తున్న ఈవీఎంలను వచ్చే ఎన్నికల్లో ఉపయోగించరాదని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది భానుప్రతాప్ సింగ్ డిమాండ్ చేశారు. ఆ మేరకు సౌత్ ఇండియన్ ముసాయిద్ యాక్షన్ కమిటీ బోర్డు ఆధ్వర్యంలో శుక్రవారం కడపలో ఈవీఎం హటావో-దేశ్‌కీ బచావో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. వేరే ఏ ఇతర పార్టీకి అనుకూలంగా ఓటు వేసినా బీజేపీకే ఆ ఓటు చేరేలా ఈవీఎంలలో ముందస్తుగా నిక్షిప్తం చేశారనే అనుమానాలను చాలామంది వ్యక్తం చేశారన్నారు. కావున ఈవీఎంల ద్వారా కాకుండా బ్యాలెట్‌పేపర్ ద్వారా రానున్న సార్వత్రిక ఎన్నికలను నిర్వహించేలా కేంద్ర ఎన్నికల సంఘం స్పందించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ బోర్డు కన్వీనర్ ఎస్.జహీరుద్దీన్ హుస్సేన్, కో కన్వీనర్ సయ్యద్ సలావుద్దీన్, నాయకులు అమీర్‌బాబు, నజీర్‌అహ్మద్, అలీఖాన్, కె.సీ.బాదుల్లా, ఫాదర్లు మోహన్‌బాబు, విల్సన్, సిరాజ్‌బుఖారి తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి


పోలీసు అధికారులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ సుధాకర్

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 23: రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో పోలీసు అధికారులతో పాటు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని డీఎస్పీ సుధాకర్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ అన్నమయ్య జిల్లాలో ఉన్న సీఐలు, ఎస్ఐలతో రానున్న సార్వత్రిక ఎన్నికలపై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏ పోలింగ్ కేంద్రంలో ఎంత మంది ఓటర్లు ఉన్నారు అనే విషయాలను ఆరా తీసి భద్రత పరమైన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకోవాలని సూచించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సూచించారు. ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు సమర్థంగా ఎదుర్కోవడానికి ప్రతి ఒక్క పోలీసు అప్రమత్తంగా ఉండాలన్నారు.

29 లోపు దుకాణాల ఏర్పాటుకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

కడప (చిన్నచౌకు), ఫిబ్రవరి 23: జిల్లాలో కొత్తగా దుకాణాల ఏర్పాటు చేసేవారు దుకాణాల సంస్థల చట్టం-1988 ప్రకారం తప్పనిసరిగా అనుమతి కోసం కార్మికశాఖ కార్యాలయంలో నమోదు చేసుకుని రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందాలని కార్మికశాఖ ఉప కమిషనర్ బి.శ్రీకాంత్‌నాయక్ శుక్రవారం ప్రకటనలో కోరారు. దుకాణాల సంస్థలు ఏర్పాటు చేసుకునే వారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందాలని సూచించారు. గడువు తక్కువగా ఉండడంతో ప్రతి ఒక్కరూ ఈనెల 29లోపు నమోదు చేసుకువాలని ఆయన కోరారు.

రాష్ట్రస్థాయి ఉపన్యాస పోటీల్లో తృతీయ విజేతలుగా సానియా, వెన్నెల


బహుమతులు అందుకుంటున్న విద్యార్థినులు

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 23: భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ, నెహ్రూ యువకేంద్ర సంగతాన్ ఏపీ వారు నిర్వహించిన మై భారత్ వికసిత్ భారత్ 2047 అనే అంశంపై శుక్రవారం గుంటూరులో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించినట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి మణికంఠ వెల్లడించారు. పోటీలలో జిల్లాకు చెందిన ఎస్‌కేఆర్ కళాశాల విద్యార్థిని సయ్యద్ సానియా, ట్రిపుల్ ఐటీ విద్యార్థిని వెన్నెల సంయుక్త తృతీయ విజేతలుగా గెలుపొందడం హర్షణీయమన్నారు. విజేతలకు రూ.25వేలు నగదు బహుమతి అందించారన్నారు. ఇలాంటి పోటీలలో యువత మరింతగా పాల్గొని జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.

రేపు జిల్లా స్థాయి పురుషుల కబడ్డీ క్రీడాకారుల ఎంపికలు

కడప (స్పోర్ట్స్), ఫిబ్రవరి 23: ఉమ్మడి వైయస్ఆర్ కడప జిల్లా స్థాయి సీనియర్స్ పురుషుల కబడ్డీ క్రీడాకారుల ఎంపికలు ఈనెల 25వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు నగర డీఎస్ఏ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ జనర్ సెక్రటరీ ఆర్.వెంకటసుబ్బయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.అరుణ తెలిపారు. 85 సంవత్సరాలలోపు ఔత్సాహిక క్రీడాకారులు తప్పక ఎంపికలకు హాజరు కావాలన్నా రు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే మార్చి 3, 4, 5, తేదీలలో వైజాగ్‌లో నిర్వహించే అంతర్ జిల్లాల పురుషుల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొనాల్సి వుంటుందన్నారు. ఇతర వివరాలకు 6304809294, 9392951505 అనే నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

కుక్కల దాడిలో 25 గొర్రెలు మృతి


కుక్కల దాడిలో చనిపోయిన గొర్రెలు

రామాపురం, ఫిబ్రవరి 23: మండలంలోని కల్పనాయునిచెరువు పంచాయతీ మూగిరెడ్డిగారిపల్లెలో శుక్రవారం ఉదయం గొర్రెల మందపై కుక్కలు దాడి చేసి 25 గొర్రెలను చంపేశాయి. బాధితుల వివరాల మేరకు.. మూగిరెడ్డిగారిపల్లెకు చెందిన తాతిరెడ్డి గంగిరెడి ఊరు బయట కంచె ఏర్పాటు చేసి గొర్రెల మందను తోలేవాడు. శుక్రవారం తెల్లవారుజామున కుక్కలు మందపై కుక్కలు దాడి చేసి 25 గొర్రెలను చంపేశాయి. ఉదయం గంగిరెడ్డి ఆయన భార్య నాగరత్నమ్మ మృతి చెందిన గొర్రెలను చూసి బోరున విలపించారు. పంటలు పండకపోవడంతో అప్పు చేసి గొర్రెలను పెంచుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నామని.. గొర్రెల మృతితో తాము రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. చనిపోయి గొర్రెల విలువ దాదాపు మూడు లక్షల వరకు ఉంటుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరారు. సమాచారం అందుకున్న పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి గ్రామానికి చేరు కుని పోస్టుమార్టం నిర్వహించారు. గొర్రెలకు బీమా లేకపోవడంతో, ప్రభుత్వం నుంచి సాయం అందే అవకాశం లేదని తెలిపాడు.

పెన్నానదిలో వ్యక్తి గల్లంతు

వల్లూరు, ఫిబ్రవరి 23: మండల పరిధిలోని పుష్పగిరి వద్ద పెన్నానదిలో చెన్నయ్య అనే వ్యక్తి గల్లంతయినట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు... సీకేదిన్నె మండలం పోలుగారిపల్లె గ్రామానికి చెందిన చెన్నయ్య బేల్దారి పనిచేస్తూ జీవనం సాగించేవాడు. తన తోటి పనివారితో కలిసి 9 మంది పుష్పగిరికి వచ్చారు. పెన్నానదిలో స్నానం చేస్తుండగా చెన్నయ్య కనిపించకుండా పోయాడు. తోటి కూలీల అతని కుటుంబ సభ్యులకు తెలిపారు. చెన్నయ్య భార్య గంగమ్మ అక్కడకు చేరుకుని తన భర్త కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది హుటాహుటిన ఎస్ఐ వెంకటరమణ తన సిబ్బందితో అక్కడకి వెళ్లి విచారించారు. అప్పటికే చీకటి పడడంతో శనివారం పూర్తిస్థాయిలో అతని ఆచూకీ కోసం వెతికిస్తామని తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ... ఆర్మీ జవాను మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు


సంఘటనా స్థలంలో క్షతగాత్రులు, ప్రమాదంలో మృతి చెందిన ఆర్మీ జవాన్ మనోజ్ (ఫైల్)

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 23: మండలంలోని రామిరెడ్డికుంట సమీపంలో గుర్తు తెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో మనోజ్ అనే ఆర్మీ జవాను అక్కడికక్కడే మృతి చెందగా, తిరుపతి, అంజి అనే ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ మల్లిఖార్జునరెడ్డి కథనం మేరకు.. ప్రకాశం జిల్లా బెస్తవారిపేట మండలం గంజరపల్లెకు చెందిన వీరు శుక్రవారం సంతకు వచ్చి కొమరోలు వైపు తిరిగి వెలుతుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుడు మనోజ్ 8 ఏళ్ల క్రితం నుంచి ఆర్మీలో ఉన్నాడని, రెండేళ్ల క్రితం వివాహం జరిగిందని, ఒక కుమారుడు సంతానమని తెలిసింది. విషయం తెలిసిన ఎస్ఐ సంఘటనాస్థలానికి వెళ్లి విచారణ చేశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అంజిని మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న మనోజ్ కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని బోరున విలపించారు.

వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న షకీలా

చిన్నమండెం, ఫిబ్రవరి 23: ఆస్తిని కాజేసేందుకు వేధిస్తున్నారనే కార ణంతో షకీలా అనే మహిళ శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్ఐ రమేశ్‌బాబు తెలిపారు. స్థానికుల వివరాల ప్రకారం... చాకిబండ పంచాయతీకి చెందిన షకీలా ఇద్దరు పిల్లలు మాండవ్యనది వరదల్లో కొట్టుకుపోవడంతో ప్రభుత్వం రెండేల్ల క్రితం ఆర్థిక సాయం అందించింది. ఆ సొమ్ముతో షకీలా కొంత ఆస్తిని కొంది. ఈ ఆస్తిని కాజేసేందుకు తన భర్త పెద్ద భార్య కొడుకు రౌడీ మూకలతో కలిసి తనను వేధిస్తున్నాడంటూ పలుమార్లు పోలీ సులకు ఫిర్యాదు చేసింది. అయినా, ఎటువంటి ఫలితం లేకపోవడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ విషయం గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు. దీనిపై విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన నాగశివకుమార్

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 23: కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బ్రహ్మంగారిమఠం మండలంలోని ప్రభునగర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ విద్యాసాగర్ వివరాల మేరకు.. వెల్లాల నాగశివకుమార్(54) బ్రహ్మంగారి మఠం దేవస్థానంలో డ్రైవరుగా విధులు నిర్వహించేవారు. గురువారం అర్ధరాత్రి ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతునికి ఇద్దరు భార్యలు కాగా.. మొదటి భార్యకు ముగ్గురు సంతానం, మరో భార్యకు ఒకరు సంతానం. కొంతకాలంగా ఆర్థిక సమస్యలతో ఆరోగ్యం సరిగా లేక మృతుడు ఉరి వేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుని తల్లి సరోజనమ్మ ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గండికోట ప్రాజెక్టులో భారీగా తగ్గిన నీటిమట్టం

కొండాపురం, ఫిబ్రవరి 23: గండికోట ప్రాజెక్టులో నీటిమట్టం భారీగా తగ్గింది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీయంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 5.71 టీయంసీల నీరు మాత్రమే నిల్వ ఉన్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. కాగా ప్రాజెక్టు నుంచి ప్రస్తుతం మిగిలిన రిజర్వాయిర్లకు నీటిని వదలడం లేదు. వచ్చేది ఎండకాలం కావడంతో ఈ నీటిమట్టం మరింత తగ్గే అవకాశం ఉంది.

నిరంతరాయంగా ఏడు గంటల విద్యుత్ ఇవ్వాలి


ఇన్‌చార్జి ఏఈతో చర్చిస్తున్న రైతులు

ఖాజీపేట, ఫిబ్రవరి 23: పంటలు ఎండిపోతున్నాయని.. నిరంతరాయంగా ఏడు గంటలు కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడుతున్న కొందరు రైతులు శుక్రవారం ఖాజీపేట సబ్‌స్టేషన్‌కు చేరుకుని ఇన్‌చార్జి ఏఈ గోవర్ధన్‌రెడ్డి ఎదుట తమ ఆవేదన వెలిబుచ్చారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇష్టానుసారంగా విద్యుత్తు సరఫరా చేస్తుండటంతో పంట లు ఎండుపోతున్నాయని వాపోయారు. నిరంతరాయంగా ఏడు గంటలు ఇవ్వకపోయినా కనీసం ఆరు గంటలైనా ఇవ్వాలన్నారు. రోజు మూడు దఫాలుగా విద్యుత్తు సరఫరా ఇస్తున్నారని, రాత్రివేళల్లో ఇబ్బంది పడుతున్నామని తెలి పారు. దీనిపై ఏఈని వివరణ కోరగా రైతులు ఎవరు వచ్చినా సమాధానం చెబుతానని.. ఎక్కువ ఫోన్లు రావడంతో కొందరికి చెప్పలేకపోయానని, అంతమాత్రాన రైతులకు సమాధానం ఇవ్వనట్లు కాదని తెలిపారు.

ప్రతిభ కనబరిచిన పోలీసులకు వీక్లీ బెస్ట్ ఫెర్ఫార్మెన్స్ అవార్డులు


అత్యుత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందికి ప్రశంసాపత్రం, నగదు రివార్డులు అందించిన ఎస్పీ సిద్ధార్థ కౌశల్

కడప (క్రైం), ఫిబ్రవరి 23 : విధి నిర్వహణలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన పోలీసు సిబ్బందిని ప్రోత్సహించే క్రమంలో జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ వీక్లీ బెస్ట్ ఫెర్మార్మెన్స్ అవార్డులు అందిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ముగ్గురు సివిల్, స్పెషల్‌బ్రాంచ్, ఎస్ఈబీ నుంచి ఒక్కొక్కరిని ఎంపిక చేసి నగదు రివార్డు, ప్రశంసాపత్రం అందించి అభినందించారు. జిల్లా స్పెషల్ బ్రాంచ్ కార్యాలయంలో కీలక విధులను సమర్థవంతంగా నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ క్షేత్రతాప్‌ను, బద్వేలు పోలీసుస్టేషన్ పరిధిలోని పీపీ కుంట చెక్‌పోస్టు వద్ద అక్రమంగా తరలిస్తున్న నగదును స్వాధీనం చేసుకోవడంలో కృషి చేసిన కానిస్టేబుల్ ఎల్.అమరేశ్వర్‌రెడ్డిని, మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకోవడంలో కృషి చేసిన ఎన్‌ఫోర్స్‌మెంటు కానిస్టేబుల్ కె.విశ్వనాథరెడ్డిలను అభినందించి ప్రశంసాపత్రం, నగ దు రివార్డు అందించారు. అలాగే ముద్దనూరు పోలీసుస్టేషన్ పరిధిలో ఓ హత్యకేసులో నిందితులకు శిక్ష పడేలా చేసిన కానిస్టేబుల్ కె.రమేష్‌కుమార్, ప్రొద్దుటూరు త్రీ టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో లక్షల విలువైన ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవడంలో కృషి చేసిన కానిస్టేబుల్ ఎం.తిరుమలయ్యలను ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రం, నగదు రివార్డులు అందించారు.

చిరుత పులి సంచారం.. భయం గుప్పిట్లో ప్రజలు

చక్రాయపేట, ఫిబ్రవరి 23: మండలంలోని సురభి, చిలేకాంపల్లె, నెరుసుపల్లె గ్రామాల పరిసరాలలో చిరుతపులి సంచరిస్తున్నట్లు పశుకాపరులు చెబుతున్నారు. ఆయా గ్రామాల పొలాల పరిసర ప్రాంతాలలో చిరుతపులి సంచరిస్తుండగా కొందరు ఫోటోలు తీసినట్లు పశుకాపరులు చెబుతున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు భయంగుప్పిట్లో ఉన్నారు. అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

తప్పిన పెను ప్రమాదం

కడప (క్రైం), ఫిబ్రవరి 23: కడప నగరంలోని ముత్తరాసుపల్లెలో ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్‌స్తంభాలు ఒక్కసారిగా కూలిపోయాయి. కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గురువారం అర్ధరాత్రి సమయంలో పనులు చేపడుతుండగా ఎక్స్‌కవేటర్ డ్రైవరు నిర్లక్ష్యంతో ప్రమాదం సంభవించి.. విద్యుత్ స్తంభాలు ఒక్కసారిగా ఇళ్లపైకి కూలిపోవడంతో స్థానిక ప్రజలు భయాందోళన చెందారు. స్థానికంగా ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ సరఫరా ఉండి ఉంటే.. ఊహించడానికే వణుకు పుడుతుంది. స్థానిక ప్రజల సమాచారంతో విద్యుత్ అధికారులు, చిన్నచౌకు పోలీసులు హుటాహుటిన సంఘటనాస్థలానికి చేరుకున్నారు. పరిస్థితి చక్కబరిచేందుకు అధికారులు తమ వంతు కృషి చేశారు. ప్రమాదం తప్పడంతో ప్రజలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.


ఇళ్లపై కూలిపోయిన విద్యుత్ స్తంభాలు


రాయచోటి:నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ, ఏపీ రైతు సంఘాల నేతలు


రైల్వేకోడూరు: సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు


రాజంపేట: కేంద్ర ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్, వామపక్ష నేతలు


పెనగలూరు బస్టాండు మూడు రోడ్ల కూడలిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

అన్నదాతను అణగదొక్కితే ఆకలి కేకలు తప్పవు

● నినదించిన ప్రజా, రైతు సంఘాలు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 23: అన్నదాతను అణగదొక్కితే ఆకలి కేకలు తప్పవని, బీజేపీ ప్రభుత్వ రాక్షస చర్యలతో అన్నదాతలు నానా అవస్థలు పడుతున్నారని సీఐటీయూ అన్నమయ్య జిల్లా కార్యదర్శి అబ్బవరం రామాంజులు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి అన్నారు. శుక్రవారం సీఐటీయూ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతాంగ సమస్యలను విస్మరిస్తే భావితరాలు ఆహార సంక్షోభం ఎదుర్కోక తప్పదన్నారు. రైతాంగ పోరాటాన్ని పోలీసుల సాయంతో అణగదొక్కాలని చేసిన ప్రయత్నం విఫలం కావడంతో కాల్పులు జరపడం దారుణమన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించడం వ్యతిరేకించాలని ఎంఎం స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేయాలని, పోలవరంతో పాటు పెండింగ్‌లోని నీటి ప్రాజెక్టుల పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. చనిపోయిన రైతుకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించా లన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ చెన్నయ్య, మాధవయ్య, పామయ్య, సీఐటీయూ, ప్రధాన కార్యదర్శి డీ. భాగ్యలక్ష్మి, లీడర్లు సిద్దమ్మ, సుమలత, భూదేవి, సునందమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు(రూరల్): రైతులపై కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరి నశించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల ఉద్యమాన్ని కేంద్ర ప్రభుత్వం అణగదొక్కుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధాన్ని తలపించేలా రైతులపై కేంద్ర ప్రభుత్వం బుల్లెట్‌లు ప్రయోగిస్తున్నారని ఈ దాడుల్లో 24 సంవత్సరాలు గల యువ రైతు మరణించడం చాలా బాధాకరమన్నారు. రైతులపై కేంద్ర ప్రభుత్వ వైఖరి మారాలని లేనిపక్షంలో తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ కోడూరు మండల కార్యదర్శి గంగాపూర్ తేజ్ కుమార్ సీపీఐ నాయకులు గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట: వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆందోళన చేస్తున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం అణచివేతకు పాల్పడుతోందని శుక్రవారం పలు పార్టీల నాయకులు రాజంపేటలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్, కాంగ్రెస్‌పార్టీ రాజంపేట ఇన్‌చార్జి పూల భాస్కర్, మున్సిపల్ కార్మిక నాయకుడు ప్రసాద్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు సుంకన్న, హరిల మాట్లాడుతూ పంజాబ్‌లో పోలీసు కాల్పుల్లో రైతు శుభకరన్‌సింగ్, గుండెపోటుతో మరో రైతు మృతి చెందడం దారుణమన్నారు. గిట్టుబాటు ధర కల్పించకుండా రైతులపై కాల్పులు జరపడం, ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణచడం దుర్మార్గమని విమర్శించారు. వెనువెంటనే కేంద్ర ప్రభుత్వం రైతుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పెనగలూరు : కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను విడనాడాలని ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి ఈరి సుబ్బరాయుడు అన్నారు. ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు వై.చలపతి అధ్యక్షతన శుక్రవారం మండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలిలో కేంద్ర ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటకు గిట్టుబాటు ధర కావాలని ఢిల్లీలో శాంతియుత నిరసన కార్యక్రమం చేస్తున్న రైతులపై కేంద్ర ప్రభుత్వ బలగాలు నిర్దాక్షిణ్యంగా కాల్పులు జరిపి ఒక రైతు మృతికి కారణం కావడం దుర్మార్గమైన చర్య అన్నారు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో పాలకులు తప్పు చేస్తుంటే అది తప్పు అని, సరైన మార్గంలో వెళ్లాలని సూచించే హక్కు భారత ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ ఉంటుందన్నారు. ప్రశ్నించే ప్రజలను తమ పవర్‌తో అణిచివేయాలనుకోవడం, కొట్టించడం, చంపించడం వంటి చర్యలు చూస్తుంటే నిరంకుశపాలనలో ప్రజాస్వామ్య కూనీ అయిపోయినట్లుగా కనిపిస్తోందన్నారు. అధికార మదంతో ఉన్న ప్రభుత్వాలు ఇలాగే చేసుకుంటూ పోతే ప్రజాస్వామ్యం లో సాధారణపౌరులు జీవించలేరని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పల్లాల వెంకటేష్, శ్రీను, ఎం.శివయ్య, షేక్ అలీషేర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం టీడీపీతోనే సాధ్యం


ప్రచారం చేస్తున్న అనితా దీప్తి

రైల్వేకోడూరు(రూరల్) ఫిబ్రవరి 23: ప్రజా సంక్షేమం టీడీపీతోనే సాధ్యమవుతుందని నియోజకవర్గ నాయ కురాలు దుద్యాల అనితా దీప్తి తెలి పారు. శుక్రవారం పట్టణంలోని గాండ్లవీధి, అంజనేయస్వామి వీధి, పాత బజార్‌లో ముమ్మర ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేసే సంక్షేమ పథకాలపై మహిళ లకు యువతకు వివరించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం టీడీపీ అధికారంలోకి రావాల న్నారు. ఈ కార్యక్రమంలో శాప్ మాజీ డైరెక్టర్ దుద్యాల జయచంద్ర, పట్టణ అధ్యక్షుడు పోకల మణి, వార్డు సభ్యులు మణి యాదవ్, మద్దిన గిరి నాయుడు, దారపునేని వెంకటరమణ నాయుడు, శ్రీను, ఏసోబు చౌదరి, మవిళ్ళ రామయ్య, నగిరిపాటి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గొర్లముదివేడు యువత టీడీపీలో చేరిక


రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన గొర్లముదివేడు యువత


రాయచోటిటౌన్, ఫిబ్రవరి 23: మండల పరిధిలోని గొర్లముదివేడు గ్రామం గుట్టకింద హరిజనవాడకు చెందిన మడితాడి మహేశ్, నాగేంద్ర, సుధాకర్, అంజి, చరణ్, సాయి, వెంకటేశ్వర్లు, నాగార్జున, యల్లయ్య తదితరులు శుక్రవారం మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. రాంప్రసాద్‌రెడ్డి టీడీపీ కండువాలు కప్పి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. భవిష్యత్తులో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో రాయచోటి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి విజయానికి మీ వంతు కృషి చేయాలని ఆయన యువతకు సూచించారు.

నాణ్యత ప్రమాణాలపై అవగాహన కలిగి ఉండాలి


వ్యాసరచన పోటీ విజేతలకు ప్రశంసా పత్రాలు, నగదు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ పుష్పలత


రామాపురం, ఫిబ్రవరి 23: నాణ్యత ప్రమాణాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కస్తూర్బా బాలికల పాఠశాల ఎస్‌వో పుష్పలత అన్నారు. స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాల బీఐఎస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన నాణ్యత ప్రమాణాలపైన శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించి విజేతలకు నగదు బహుమతితో పాటు సర్టిఫికెట్లు, ప్రశంసా పత్రాలను అందజేశారు. డైట్ స్కూల్ ఉపాధ్యాయుడు నాగరాజు క్లబ్ మెంబర్ శారదమ్మ కేజీబీవీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీఎల్‌వోల పాత్ర కీలకం


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి లీలారాణి

రైల్వేకోడూరు(రూరల్) ఫిబ్రవరి 23: ఎన్నికల్లో బీఎల్‌ఓల పాత్ర చాలా కీలకం అని రైల్వేకోడూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.లీలారాణి తెలిపారు. శుక్రవారం నియోజకవర్గంలోని ఐదు మండలాల బీఎల్‌ఓలతో తహసీల్దార్ కార్యాలయం సభా భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్ జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని తప్పులుంటే పూర్తి బాధ్యత బీఎల్‌ఓలదేనని హెచ్చరించారు. ఓటర్ల లిస్టులో మార్పులు ఉంటే అధికారులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఓటరు లిస్టులో చాలా మార్పులు ఉన్నాయని బీఎల్‌ఓలు ప్రతి ఇంటికి వెళ్లి ఓటరు లిస్టులో ఉన్న ఓటర్లను అన్ని వివరాలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పుల్లంపేట తహసీల్దార్, కోడూరు ఉపతహశీల్దార్ అమరేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లెలో టీడీపీ నేతల నిరసన


నిరసన తెలుపుతున్న రమేశ్‌రెడ్డి వర్గీయులు

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 23: రాయచోటి అసెంబ్లీ టీడీపీ టికెట్టు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి కేటాయిస్తున్నారన్న సమాచారంతో శుక్రవారం రాత్రి టీడీపీ నాయకులు నిరసనకు దిగారు. ఈ మేరకు లక్కిరెడ్డిపల్లె మూడురోడ్ల కూడలిలో తెలుగుదేశం పార్టీ జెండాలు, కండువాలు, కరపత్రాలను దగ్ధం చేశారు. టీడీపీకి వ్యతిరేకంగా నినాదాలు చేసి జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేశారు. శుక్రవారం రాత్రి మాజీ సీఎం చంద్రబాబు రమేశ్‌కుమార్‌రెడ్డికి ఫోన్ చేసి రాంప్రసాద్‌రెడ్డి టికెట్టు విషయం చెప్పినట్లు సమాచారం. దీంతో రమేశ్‌కుమార్‌రెడ్డి అనుచరులు నిరసనకు దిగారు.

దోమల నివారణకు చర్యలు

సంబేపల్లె, ఫిబ్రవరి23: గ్రామీణ ప్రాం తంలో ప్రజలు జ్వరాల బారిన పడ కుండా దోమలను నివారిద్దామని సంబే పల్లె ప్రాథమిక వైద్యాధికారి సత్య నారాయణరెడ్డి తెలిపారు. శుక్ర వారం దుద్యాల గ్రామం పెద్దజంగం పల్లెలో వైద్య సిబ్బందితో పైరిత్రియం మందు ను పిచికారి చేశారు. జ్వరాల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. రాత్రి వేళలో ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్, ఎంఐహెచ్‌పీ సబ్రిన్, సచివాలయ ఏఎన్‌ఎం దుర్గాప్రసాద్, ఆశ వర్కర్ వారాది జయమ్మ పాల్గొన్నారు.

కోళ్ల రవాణాపై నియంత్రణను అమలు చేయాలి

చిట్వేలి, ఫిబ్రవరి23 : నెల్లూరు, అన్నమయ్య జిల్లా సరిహద్దు చిట్వేలి మండలంలో అనుంపల్లి వద్ద గల అంతర్ జిల్లా చెక్‌పోస్టును రాజంపేట పశుసంవర్ధక శాఖ డీడీ విజయ్ భాస్కర్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాయిలర్ కోళ్ల రాకపోకల నియంత్రణ చర్యలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కోళ్ల రవాణా నియంత్రణను పటిష్ఠంగా అమలు చేయలన్నారు. కోళ్ల రవాణా నిషేధం అమలులో ఉన్నట్లు అన్నమయ్య జిల్లా కలెక్టర్ పేరు మీద బ్యానర్ ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో చిట్వేలి ఏరియా పశువైద్య శాల ఏడీ కె.డి.వరప్రసాద్, డాక్టర్ భువనేశ్వరి, ఎల్‌ఎస్‌ఏ మణి, డీఈవో నాయక్, గోపాలమిత్ర సుబ్బయ్య, చెక్‌పోస్టు పోలీసు శివ తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

సిద్దవటం, ఫిబ్రవరి 23 : మార్చి 3 నుంచి జరిగే పల్స్‌పోలియో పొన్నవోలు పీహెచ్‌సీ వైద్యాధికారిణి రంగలక్ష్మి పిలుపునిచ్చారు. సిద్దవటం ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు, ఆశ కార్యకర్తలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 3వ తేదీన కేంద్రాల వద్ద 4, 5వ తేదీల్లో ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేయాలన్నారు. పోలియో చుక్కలు వికటిస్తే వెంటనే పీహెచ్‌సీకి పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో శంషాద్‌బేగం, సూపర్‌వైజర్లు రామ్మోహన్, పద్మావతి, రూట్ అదికారులు కాలేబు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధి బాధితుడికి ఆర్థిక సాయం

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 23: మండలంలోని చిన్నఓరంపాడు గ్రా మ పంచాయతీ దిగువపల్లెకు చెందిన రేకులకుంట రమణయ్య అనే వ్యక్తి కిడ్నీ సమస్యతో బాధపడుతుండ డం తో టీడీపీ నాయకుడు ముక్కా రూ పానందరెడ్డి తనయుడు ముక్కా సాయి వికాస్‌రెడ్డి 25వేల రూపాయ లు ఆర్థిక సాయం అందజేశారు. సర్పంచ్ అరవ శ్రీధర్, గద్దె పెంచలయ్య, చింతు రాజారెడ్డి, వంకన శివారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రేకులకుంట నరసింహ, నారపరెడ్డి రాజారెడ్డి, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, , తిరుపాల్, కృష్ణయ్య, నారాయణ, శ్రీనివాసులు, తౌసీఫ్, హరి తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

ఒంటిమిట్ట, ఫిబ్రవరి 23 : డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యమని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక హరిత హోటల్‌లో ఆసరా చె క్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసరా పథకం కింద సిద్దవటం మండలానికి 6,19,21,000, ఒంటిమిట్ట మండలానికి 4,81,65,000 కోట్ల రూపాయలు డ్వాక్రా మహిళలకు అందజేశామన్నారు. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ డ్వాక్రా రుణమాఫీతో మహిళల్లో ఆనందాన్ని చూడాలన్న కోరికను నెరవేర్చారన్నారు. సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల వెలుగు సిబ్బంది పెద్దఎత్తున మహిళలను కార్యక్రమానికి తరలించడంతో కుర్చీలు లేక పలువురు మహిళలు నిల్చునే కార్యక్రమంలో పాల్గొన్నారు. కొద్ది రోజులుగా డ్వాక్రా మహిళలకు నగదు చెల్లిస్తామని మీటింగ్‌కు పిలిచి వెనక్కి పంపుతున్నారు తప్ప తమ అకౌంట్‌లో పడలేదని పలువురు మహిళలు విమర్శించారు. ఏపీఎం నాగార్జున్ నాయుడు, వెలుగు , పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం


నందకిశోర్, స్వర్ణలత

సంబేపల్లె, ఫిబ్రవరి 23: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాయచోటి కార్యవర్గాన్ని ఏపీ ఎన్జీవో రాష్ట్ర జనరల్ సెక్రటరీ ప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాయచోటి జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడిగా వీ. నందకిశోర్, ఉపాధ్యక్షులు స్వర్ణలత, జనరల్ సెక్రటరీగా అజ్మతుల్లాబాషా, జాయింట్ సెక్రటరీగా ఇంద్రనాథ్‌రెడ్డి, ట్రెజరర్‌గా మధుసూదన్ రెడ్డి, డిస్ట్రిక్ కౌన్సిలర్లుగా రెడ్డికేశవ, శ్రీదేవిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీరాజ్ మినిస్టర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ తరపున ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. వీరి ఏకగ్రీవ ఎంపికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

గాలివీడు: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ లక్కిరెడ్డిపల్లె సమితి అధ్యక్షుడుగా గాలివీడుకు చెందిన మదన్‌కుమార్ ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఉపాధ్యక్షులుగా సులోచన, జనరల్ సెక్రటరీగా గురుప్రసాద్, జాయింట్ సెక్రటరీగా మనికంఠ, ట్రెజరర్‌గా శ్రీనివాసులు, డిస్ట్రిక్ట్ కౌన్సిలర్‌గా శ్రీనివాసులు, శోభారాణిని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు వారు తెలిపారు. ఎన్నికల అధికారిగా లక్కిరెడ్డిపల్లె ఎంపీడీవో వ్యవహరించారు.

నేటి నుంచి మహాభారత యజ్ఞం

సంబేపల్లె, ఫిబ్రవరి 23: మండల పరిధిలోని గుట్టపల్లె ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం నుంచి పంచమ వేద మహాభారత యజ్ఞాన్ని నిర్వహిస్తున్నట్లు ధర్మకర్తల మండలి సభ్యులు రవీంద్రనాయుడు, చిదబర్‌రెడ్డి, పాల వెంకట్రమణ తెలిపారు. ఫిబ్రవరి 24 నుంచి మార్చి 13వ తేదీ వరకు 19 రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పగటి హరికథ తిరుపతికి చెందిన కౌసల్య, రాత్రి నాటకాలు తిరుపతికి చెందిన పద్మావతి వెంకటేశ్వర నాట్య కళామండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రేపు ప్రసన్న వేంకటేశ్వర స్వామి కల్యాణం

సుండుపల్లె, ఫిబ్రవరి 23: ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం 6వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం స్వామి వారి కల్యాణం, ఊరేగింపు ఉంటుందని ఆలయ అర్చకుడు అమ్మనాయక్ శుక్రవారం తెలిపారు. ఆరోగ్యపురం పరికిబండలోని ఈ ఆలయంలో 25 ఉదయం గణపతి పూజ, అర్చన, కలశపూజ, మంగళహారతి, పుణ్యాహవచనం, పంచామృతాభిషేకం, 9 గంటలకు అభిషేకాలు నిర్వహిస్తారు. 10 గంటల నుండి 12 గంటల వరకు మాచిరెడ్డిగారిపల్లె పంచాయతీకి చెందిన సుబ్బరామ్ నాయక్, రెడ్డినాయక్, జయరాంనాయక్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఒంటిమిట్ట కోదండ రామస్వామి ఆలయ, అర్చకుల ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణం, అనంతరం శాంతి హోమం, మంగళహారతి ఉంటుందన్నారు. కల్యాణం అనంతరం వచ్చిన భక్తులకు జీ. రెడ్డివారిపల్లెకు చెందిన రాయపాటి జయరామయ్య, లక్ష్మీదేవి దంపతులు అన్నదానం, హరినాథ్‌రెడ్డి డిగ్రీ కళాశాల నిర్వాహకులు తిరుమల లడ్డూను అందజేస్తారని తెలియజేశారు.

వైసీపీని ఓడించడమే అందరి కర్తవ్యం

● మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌కుమార్‌రెడ్డి

సంబేపల్లె, ఫిబ్రవరి 23: రాయచోటి నియోజకవర్గంలో వైసీపీని ఓడించడమే మన అందరి కర్తవ్యమని, రాబోయే ఎన్నికల్లో రాయచోటి తెలుగుదేశం అభ్యర్థిని తానే అవుతానని, ఎన్నికల్లో తనను గెలిపించే బాధ్యత మీ అందరిపై ఉందని రాయచోటి టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సంబేపల్లె మండలం గుట్టపల్లి వద్ద శతమానంభవతి కల్యాణ మండపంలో ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాయచోటిలో టీడీపీ బాధ్యతలు గతంలో పాలకొం డ్రాయుడు మోశాడని, 2014 ఎన్నికల నుంచి తాను ఆ బాధ్యతలను తాను భుజస్కంధాలపై వేసుకొని పార్టీని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో అధికార పార్టీ దోపిడీ, అరాచకాలను 90 శాతం గడప గడపకు వెళ్లి ప్రజలకు తెలియ జేసినట్లు తెలిపారు. గత రెండు ఎన్నికల్లో వైసీపీ సానుభూతి ఓట్లతో గెలిచిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అరాచకం, అవినీతి ఎక్కు వైందన్నారు. ఈ ఎన్నికల్లో వైసీపీకి ఓటమి తప్ప దన్నారు. టీడీపీలో కొంత మంది సమస్యలను సృష్టించి అధిష్ఠానానికి వెళ్లాల్సిన సంకేతాలను తప్పుదోవ పట్టించేలా సమస్యలను సృష్టిస్తున్న ట్లు తెలిపారు. వైసీపీ నుంచి వచ్చిన వారికి పార్టీ టికెట్లు ఇస్తే సహకరించే ప్రసక్తే లేదన్నారు. తెలుగుదేశం అభ్యర్థిగా తనను అధిష్ఠానం గురి_స్తుందన్నారు. ఈ సందర్భంగా ఎస్. సోమవరం గ్రామానికి చెందిన కొంత మంది మైనార్టీలు వైసీపీ పార్టీ నుంచి టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నరసారెడ్డి, నారా ప్రభాకర్‌నాయుడు, మాదిరెడ్డి రమేశ్‌రెడ్డి, బోనమల ఖాదర్‌వలి, ప్రభాకర్‌రెడ్డి, గోపీనాథ్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, వేణుగోపాల్ నాయుడు, మల్లు విష్ణువర్ధన్‌రెడ్డి, నూరెకరాల రంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, బెల్లం నరసింహారెడ్డి, రౌతుకుంట ఖాదర్‌వలి, రాహుల్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయండి

రామాపురం: లక్కిరెడ్డిపల్లె వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి రాయచోటి వీరభద్రస్వామి ఆలయం వరకు తలపెట్టిన పాదయాత్రను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడుతూ శనివారం ఉదయం 7 గంటలకు లక్కిరెడ్డిపల్లెలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసుకుని అనంతరం గంగమ్మ తల్లి ఆలయంలో పూజల అనంతరం పాదయాత్రతో కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారిలోని చిట్లూరు, పాలన్నగారిపల్లె, టోల్‌గేట్, ఆర్‌ఆర్ స్టోన్ వద్ద భోజనాల అనంతరం మళ్లీ పాదయాత్ర మాసాపేట, ఠానా మసీదు ప్రార్థనలో అనంతరం గాంధీ బజారు ద్వారా శ్రీవీరభద్ర స్వామి ఆలయం చేరుకుంటామన్నా రు. ఈ కార్యక్రమాన్ని ఆర్‌ఆర్ అభిమానులు, బంధువులు, కార్యకర్తలు, ప్రజలు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

స్థలాన్ని షాహీ జామియా మసీదు కమిటీకి స్వాధీనం చేయాలి



నిరాహార దీక్ష చేస్తున్న ముస్లింలు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి23: మసీదు స్థలాన్ని పూర్తిగా షాహీ జామియా మసీదు కమిటీకే స్వాధీనం చేయాలని ఆ మసీదు కమిటీ మాజీ అధ్యక్షుడు, సివిల్ రైట్స్ యాక్టివిస్ట్ డాక్టర్ హుస్సేని అన్నారు. శుక్రవారం స్థానిక జామియా మసీదుకు ఎదురుగా ముస్లింలతో కలిసి ఆయన నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 12.5 ఎకరాల జామియా మసీదు స్థలంలో 4 ఎకరాల స్థలాన్ని కమిటీకి కేటాయిస్తామని హామీ ఇచ్చిన ఒక ముఖ్యమంత్రి మాట ఇచ్చి మడమ తిప్పారని, మరో ముఖ్యమంత్రి మాటిచ్చి మరిచారని, మరో ముఖ్యమంత్రి కనుమరుగయ్యారన్నారు. ఎన్నికల సమయంలో మైనార్టీల ఓట్లతో అందలమెక్కిన నాయకులు ఆ తర్వాత హామీలను మర్చిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మసీదు స్థలం తమకు అప్పగించేంతవరకు నిరాహార దీక్షలు కొనసాగుతాయన్నారు.

ఈ కార్యక్రమంలో ముస్లిం మత గురువు సర్కాజీ షర్ఫుద్దీన్, అజీజుర్ రెహ్మాన్, ఖదీర్, సలీం, తాలిబ్ అలీఖాన్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

పోష్ యాక్ట్‌తో మహిళలకు రక్షణ


సదస్సులో మాట్లాడుతున్న జడ్జి లత

నందలూరు, ఫిబ్రవరి 23: పోష్ చట్టంతో లైంగిక వేధింపుల నుంచి మహిళలకు రక్షణ లభిస్తుందని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, నందలూరు, రాజంపేట కోడూరు ఎఫ్‌ఎస్‌సి జూనియర్ సివిల్ జడ్జి కె.లత తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో శుక్రవారం పోష్‌యాక్ట్‌పై న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ పనిచేసే ప్రదేశంలో మహిళలను వేధించేవారిపై వర్తింపజేసే చట్టాలు , శిక్షలను వివరించారు. ఈ చట్టం ప్రకారం ప్రతి ఆర్గనైజేషన్‌లో పది మంది లేక అంతకు మించి ఎక్కువగా మహిళలు ఎక్కువగా ఉన్న చోట ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఏర్పాటు చేయాలని తెలియజేశారు. ఈ కమిటీలో సీనియర్ ఉమెన్, ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారని, ఇద్దరు మెంబర్లుగానూ, ఒక నాన్ ఎన్జీవోతో నలుగురు సభ్యుల కమిటీ ఏర్పాటు చేస్తారని తెలియజేశారు. జిల్లాలో లోకల్ కంప్లైంట్స్ కమిటీ ఉంటుందని ఇందులో కలెక్టర్, మేజిస్ట్రేట్, లేదా డిప్యూటీ కలెక్టర్ జిల్లా అధికారిగా వ్యవహరిస్తారని, ఒక నోడల్ ఆఫీసర్ ఉంటారని తెలిపారు. మహిళలు లైంగికంగా వేధింపులకు గురైనప్పుడు 90 రోజులలోపు ఐసీసీలో ఫిర్యాదు చేస్తే ఎంక్వైరీ చేసి రిపోర్ట్ జిల్లా అధికారికి పంపిస్తారని తెలిపారు. ఒక వేళ నేరం రుజువైతే ఐపీసీ సెక్షన్ ప్రకారం కూడా కేసు రిజిస్టర్ చేస్తారని తెలిపారు. లైంగికంగా వేధించి న వారిని ఉద్యోగం నుండి తొలగించడం, బాధిత మహిళకి, నష్టపరిహారం ఇప్పించడం జరగుతు ందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీలు, ఎంఆర్ వోలు, ఎండీవోలు, ఎంఈవోలు, స్కూల్ హెడ్ మాస్టర్లు, పోలీసు అధికారులు, ఏపీఎస్ సీడీసీఎల్, వెలుగు ఆఫీసర్లు, నందలూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు, పీఎల్‌వీలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులందరికీ ఇళ్ల రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి

సిద్దవటం, ఫిబ్రవరి 23: వివిధ కారణాలతో రిజెక్ట్ అయిన హౌసింగ్ లబ్ధిదారులను పిలిపించి శనివారంలోగా రిజిస్ట్రేషన్ చేయించాలని వీఆర్వోలకు తహసీల్దారు మురాషావలి ఆదేశించారు. సిద్దవటం తహశీల్దారు కార్యాలయంలో శుక్రవారం వీఆర్వోల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు జరిగిన హౌసింగ్ రిజిస్ట్రేషన్ పత్రాలను విజయవాడ నుంచి రాగానే ప్రింట్ తీసి ఇవ్వాలని సూచించారు. మండలంలోని 40 పోలింగ్ బూతులను తనిఖీ చేసి వసతులు కల్పించాలని వీఆర్వోలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు మాధవిలత, ఆర్ఐ అనురాధ, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాల పంపిణీ


పరికరాలు పంపిణీ చేస్తున్న అసోసియేట్ డీన్ డాక్టర్ కె.గోపాల్, అధ్యాపకులు

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 23 : ఎస్సీ సబ్‌ప్లాన్ ప్రాజెక్టులో భాగంగా ఎంపిక చేసిన 20 మంది రైతులకు శుక్రవారం స్థానిక ఉద్యాన విశ్వవిద్యాలయంలో జీవ రసాయనాలు, ప్రెషర్ కుక్కర్, మాస్కులు, గ్లౌజ్‌లు, ద్రవ, ఘన జీవన ఎరువులు, ఇతర పరికరాలను ఉచితంగా అందజేశారు. ఉద్యాన విశ్వవిద్యాలయ డీన్ డాక్టర్ ఏఎస్ పద్మావతమ్మ ఆన్‌లైన్ ద్వారా బయో ఫర్టిలైజర్స్ ఆవశ్యకత వివరించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ కె.గోపాల్ రైతులు జీవ రసాయనాల తయారీ, వినియోగంపై అవగాహన కల్పించారు. జోనల్ రీసెర్చ్ హెడ్ డాక్టర్ కె.టి.వెంకటరమణ, ఎస్సీ సబ్ ప్లాన్ ఆవశ్యకత, నిధులు పొందే విధానాన్ని వివరించారు. పరిశోధన ప్రాజెక్ట్ ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ వై.శిరీష ఈ ప్రాజెక్టు ద్వారా తాము చేపట్టిన కార్యక్రమాలు వివరించారు. 2022-23 సంవత్సరానికి భారత వ్యవసాయ పరిశోధన మండలి 4.75లక్షలు అందించిందన్నారు. ఈ నిధులతో కోడూరు, ఓబులవారిపల్లె మండలాల నుంచి ఎంపిక చేసిన 20మంది రైతులకు తక్కువ ఖర్చుతో జీవ రసాయనాల ఉత్పత్తి అనే అంశంపై ప్రాజెక్టులో భాగంగా ఏడాది పొడవునా అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. అనంతరం జీవ రసాయనాల తయారీ, వర్మీకంపోస్ట్ తయారీపై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం రైతులకు జీవన ఎరువులు, జీవ రసాయనాలు, ఇతర ఇన్‌పుట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ వై.శిరీష, అధ్యాపకులు పి.శ్యాంసుందర్‌రెడ్డి, కె.లలిత, వై.దీప్తి కిరణ్, సయ్యద్ సదరున్నీసా, జి.శారద, ఎం.జయప్రద, ఎం.హర్షిత తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో డబ్బులు తరలించడానికే లీజుకు హెలికాప్టర్లు

టీడీపీ ఆరోపణ



మీడియాతో మాట్లాడుతున్న సప్తగిరిప్రసాద్

తవణంపల్లె, ఫిబ్రవరి 23: ఎన్నికల్లో డబ్బులు తరలించడానికే హెలికాప్టర్లను సీఎం లీజుకు తీసుకున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ ఆరోపించారు. తవణంపల్లెలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వానికి సంబంధించిన హెలికాప్టర్లు అందుబాటులో ఉన్నప్పటికీ ఉగ్రవాదుల నుంచి ప్రమాదం పొంచి ఉన్నదనే సాకుతో రెండు హెలికాప్టర్లను కోట్లాది రూపాయల ప్రజాధనంతో లీజుకు తీసుకోవడం దారుణమన్నారు. ఈ లీజు కోసం ప్రభుత్వం విడుదల చేసిన జీవోను వెంటనే రద్దు చేసి.. నెలకు రూ.7.5 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలని టీడీపీ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వలేని ప్రభుత్వం..హెలికాప్టర్లను లీజుకుతీసుకోవడం విడ్డూరమన్నారు.టీడీపీ నాయకులు మధు, వినాయక, చిట్టెమ్మ, షబ్బీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.97.07 లక్షలు



చైర్మన్, ఈవో పర్యవేక్షణలో హుండీ కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 23: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.97,07,788 లభించినట్లు చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు తెలిపారు. ఆలయ ఆస్థాన మండపంలో శుక్రవారం హుండీకానుకలను చైర్మన్, ఈవో పర్యవేక్షణలో సిబ్బంది లెక్కించారు. ఈ ఆదాయంలో 131 యూఎస్ఏ, 250 ఆస్ట్రేలియా, 50 కెనడా, 10 సింగపూరు డాలర్లు, 5 యూఏఈ దిర్హామ్స్, 11 మలేసియా రింగిట్స్‌తోపాటు 38 గ్రాముల బంగారం, 950 గ్రాముల వెండి లభించాయి. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా రూ.5,470, నిత్యాన్నదాన హుండీ ద్వారా రూ.11,352 ఆదాయం సమకూరింది. ఈ లెక్కింపులో ఏఈవోలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

కలవగుంటలో భారీ చోరీ

ఓ ఇంట్లో రూ.7లక్షలు, 40 గ్రాముల బంగారం, అర కిలో వెండి అపహరణ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

పెనుమూరు, ఫిబ్రవరి 23: పెనుమూరు మండలంలోని కలవగుంట గ్రామంలో కేశవాచ్చారి కుమారుడు రాజగోపాల్ ఇంట్లో శుక్రవారం భారీ చోరీ జరిగింది. రూ.7లక్షలు, 40 గ్రాముల బంగారు నగలు, అర కిలో వెండి వస్తువులు అపహరించుకెళ్లారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. ఉదయం కుటుంబమంతా మురకంబట్టులోని బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కి వెళ్లి, సాయంత్రం ఆరు గంటలకు తిరిగి వచ్చారు. ఇంటి తలుపులు పగులగొట్టి ఉండటంతో లోపలకెళ్లి చూశారు. బీరువాలోని రూ.7లక్షలతోపాటు 40 గ్రాముల బంగారు ఆభరణాలు, అర కిలో వెండి వస్తువులు కనిపించలేదు. చోరీ జరిగిందని అర్థమవడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్లూస్ టీమ్ సంఘటనా చేరుకుని, ఆధారాలను సేకరించింది. ఇంత పెద్ద మొత్తం చోరీ కావడంతో గ్రామంలో చర్చనీయాంశమైంది.

అటవీశాఖ సిబ్బందిపైకి దూసుకెళ్లిన కారు

● కానిస్టేబుల్‌కు, ఫారెస్టు వాచ్‌మాన్‌కు గాయాలు



చికిత్స పొందుతున్న ప్రభాకర రావు

ఏర్పేడు, ఫిబ్రవరి 23:వాహనాలు తనిఖీ చేస్తున్న అటవీశాఖ సిబ్బందిపై ఓ కారు దూసుకెళ్లడంతో ఇద్దరు గాయపడ్డారు.ఆర్ఎస్ఐ వినోద్‌కుమార్ ఈ ఘటనపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు.ఎర్రచందనం తరలిపోతోందన్న సమాచారంతో తిరుపతి ఆర్ఎస్ఐ వినోద్‌కుమార్ తన సిబ్బందితో ఏర్పేడు మండలం చింతలపాళెం చెక్‌పోస్టు వద్ద శుక్రవారం తెల్లవారుజామున వాహనాలు తనిఖీ చేస్తున్నారు. టీఎస్ 09 ఈఎస్ 5767 నెంబరు గల కారు తనిఖీలకు సహకరించకుండా వేగంగా చింతలపాళెం టోల్‌ప్లాజా వైపు వెళ్లింది.తప్పించుకుపోయే క్రమంలో అక్కడ తనిఖీ చేస్తున్న మరో టీముపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కానిస్టేబుల్ కేవీ ప్రభాకర రావుకు, ఫారెస్టు వాచ్‌మాన్ సుబ్రహ్మణ్యానికి గాయాలయ్యాయి.వీరిలో ప్రభాకర రావు కరకంబాడి సమీపంలోని అమర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.ఆయన తలకు బలమైన గాయం కావడంతో సర్జరీ చేసినట్లు సమాచారం.

రెండు కార్లు ఢీ : ముగ్గురికి గాయాలు

రెండు గంటలపాటు స్తంభించిన ట్రాఫిక్



గుడిపాల, ఫిబ్రవరి 23: చిత్తూరు-వేలూరు, బెంగళూరు- చెన్నై జాతీయ రహదారిలోని సీఎంసీ సమీపంలో శుక్రవారం ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంతో సుమారు రెండు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది. హైవే నిర్మాణ పనులు జరుగుతుండటంతో వాహనాలు ఈ ప్రాంతంలో ఒకేవైపు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో చిత్తూరు నుంచి వేలూరుకు వెళ్తున్న కారు, వేలూరు నుంచి చిత్తూరు వైపు వస్తున్న కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. వాహనాల్లోని ముగ్గురికి గాయాలవ్వగా, చికిత్స నిమిత్తం 190 రామాపురం సీఎంసీలో చేర్పించారు. మరోవైపు రెండు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది. గుడిపాల ఏఎస్ఐ మునివేలు, చిత్తూరు ట్రాఫిక్ పోలీసులొచ్చి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆ రెండు కుటుంబాలకు రూ.2 లక్షల ఆర్థిక సాయం



మృతుల కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న భువనేశ్వరి

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 23: టీడీపీ కార్యకర్తల మృతుల కుటుంబాలకు శుక్రవారం నారా భువనేశ్వరి రూ2 లక్షల ఆర్థిక సాయం అందించారు. గతేడాది ఆగస్టు 4న టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జిల్లాలో ప్రాజెక్టుల సందర్శనకు వచ్చారు. అప్పుడు పూతలపట్టు మార్గంలో నిర్వహించిన ర్యాలీలో జరిగిన ప్రమాదంలో చెర్లోపల్లె పంచాయతీ పేయనకండిగకు చెందిన వేలు యాదవ్, ఏనుగుండ్లపల్లెకు చెందిన పి.అమర్నాథ్ ప్రమాదవశాత్తు మరణించారు. శుక్రవారం నారా భువనేశ్వరి ఒక్కో కుటుంబానికి ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. వారి కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా పార్టీ అధ్యక్షుడు పులివర్తి నాని, నేతలు చంద్రప్రకాష్, గురజాల జగన్మోహన్, కటారి హేమలత, కాజూరు బాలాజీ, సురేంద్రకుమార్, శశికర్ బాబు, రఘు, మోహన్‌రాజ్, మంజూస్, రాజేష్, గురేష్, శ్రీనివాసులు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



వెటర్నరీ వర్సిటీకి న్యాక్ గుర్తింపు

దేశంలోనే తొలి న్యాక్ పశువైద్య వర్సిటీగా గుర్తింపు

తిరుపతి(విద్య),ఫిబ్రవరి 23: తిరుపతి కేంద్రంగా నడిచే శ్రీవేంకటేశ్వర వెటర్నరీ వర్సిటీకి తొలిసారిగా న్యాక్ గుర్తింపు లభించింది. దేశంలోని పశువైద్య విశ్వవిద్యాలయాల్లో న్యాక్ గుర్తింపు కలిగిన వర్సిటీగా ప్రత్యేక గుర్తింపు సాధించింది. ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు మూడ్రోజుల పాటు చైర్మన్ డాక్టర్ సతీష్‌కుమార్ భండారీ నేతృత్వంలో ఆరుగురు సభ్యుల న్యాక్ పీర్ రివ్యూ టీం వర్సిటీలో పర్యటించి అనుబంధ కళాశాలలను తనిఖీ చేసి ఐదేళ్ల కాలానికి(2022-2027వరకు) న్యాక్ బీ ప్లస్ గ్రేడ్ గుర్తింపునిచ్చారు. ఇప్పటికే వర్సిటీకి 2027 మార్చి31 వరకు ఐదేళ్ల కాలానికి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్(ఐసీఏఆర్), వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(వీసీఐ) గుర్తింపుతో పాటు యూజీసీ 12బీ గుర్తింపు కూడా కలిగి ఉంది. కొత్తగా వర్సిటీ సిగలో న్యాక్ గుర్తింపు చేరడం పట్ల వర్సిటీ అధ్యాపక, ఉద్యోగ, విద్యార్థి వర్గాలు సంతోషం వ్యక్త పరుస్తున్నారు. న్యాక్‌కి సంబంధించి సెల్ఫ్‌స్టడీ రిపోర్ట్ చైర్మన్‌గా వర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సర్జన్‌రావు, కన్వీనర్‌గా ప్రస్తుత అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతి రామయ్య వ్యవహరించగా ఐక్యూ ఏసీ(ఇంటర్నల్ క్వాలిటీ అసెస్‌మెంట్ సెల్)ఇన్‌చార్జ్‌గా డీన్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య వ్యవహరించారు. ఈ గుర్తింపు వల్ల వర్సిటీకి రీసెర్చ్ ప్రాజెక్ట్‌లతోపాటు యూజీసీ నుంచి నిధులు తెచ్చుకునే వెసులుబాటు ఉంటుందని అధికారవర్గాలు అంటున్నాయి. ఈ గుర్తింపుకు కృషి చేసిన ఏడీ జగపతిరామయ్య, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, సిబ్బందిని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అరుణాచలం రవి, డీఆర్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సర్జన్‌రావు, డీన్ ప్రొఫెసర్ కె.వీరబ్రహ్మయ్య అభినందించారు.

తిరుపతిలో పొల్యూషన్ కంట్రోలు బోర్డు జోనల్ కార్యాలయం

బోర్డు ప్రతిపాదనను ఆమోదించిన ప్రభుత్వం

తిరుపతి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ పొల్యూషన్ కంట్రోలు బోర్డు జోనల్ కార్యాలయం తిరుపతిలో ఏర్పాటు కానుంది. ఇప్పటి వరకూ ప్రాంతీయ కార్యాలయం మాత్రమే వున్న తిరుపతిలో జోనల్ కార్యాలయం ఏర్పాటుకు బోర్డు చేసిన ప్రతిపాదనను రాష్ట్రప్రభుత్వం ఆమోదించింది. ఇప్పటి వరకూ రాష్ట్రంలో విజయవాడ, విశాఖపట్టణం, కర్నూలు నగరాల్లో జోనల్ కార్యాలయాలున్నాయి. కర్నూలు జోనల్ కార్యాలయ పరిధిలో మొత్తం రాయలసీమ ప్రాంతం కవర్ అవుతోంది. కొత్త జిల్లాల ఏర్పాటుతో నెల్లూరు జిల్లా పరిధిలోని పరిశ్రమల్లో 65 శాతం పరిశ్రమలు తిరుపతి జిల్లా పరిధిలోకి చేరాయి. దానివల్ల అత్తివరం, మేనకూరు సెజ్‌లు కూడా తిరుపతి పరిధిలోకి వచ్చాయి. రెడ్ కేటగిరీకి చెందిన పరిశ్రమలు, నగరిలోని డైయింగ్ యూనిట్లు, ఫ్రూట్ క్యానింగ్ యూనిట్లు, శ్రీసిటీ సెజ్, డీటీజెడ్ తదితరాలన్నీ మునుపే తిరుపతి ప్రాంతీయ కార్యాలయం పరిధిలో వున్నాయి. కొత్తగా నెల్లూరు జిల్లా నుంచీ వచ్చి చేరిన పరిశ్రమల కారణంగా తిరుపతి జిల్లాలోకి 17 రకాల ప్రమాదకరమైన పరిశ్రమలన్నీ చేరినట్టయింది. వీటిని 450 కిలోమీటర్ల దూరాన వున్న కర్నూలు నుంచీ తరచూ రాకపోకలు సాగించి పర్యవేక్షించడం కష్టసాధ్యమని గుర్తించిన ఏపీ పొల్యూషన్ బోర్డు తిరుపతిలో కొత్తగా జోనల్ కార్యాలయం ఏర్పాటు చేయడమే ఉత్తమమని భావించింది. ఆ మేరకు బోర్డు పాలకమండలి సమావేశంలో ప్రతిపాదనను ఆమోదించి అనుమతి కోసం రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది. కొత్తగా భవన నిర్మాణం వంటివేవీ అవసరం లేదని, ఇప్పటికే తిరుపతిలో ప్రాంతీయ కార్యాలయం కోసం 25 సెంట్ల స్థలంలో రెండు సెల్లార్లు, గ్రౌండ్ ఫ్లోర్ సహా ఐదంతస్తుల భవనం కొత్తగా నిర్మించినందున ఆ భవనంలోనే జోనల్ కార్యాలయం కూడా నిర్వహించుకునే వీలుందని ప్రభుత్వానికి నివేదించింది. దీంతో కొత్తగా పోస్టులేవీ మంజూరు చేయకుండా వున్న సిబ్బందితోనే సర్దుబాటు చేసుకోవాలని సూచిస్తూ తిరుపతి కేంద్రంగా జోనల్ కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.ఈమేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.దీంతో తిరుపతిలో త్వరలో జోనల్ కార్యాలయం ఏర్పాటు కానుంది.

కుమారధార తీర్థ ముక్కోటికి ఏర్పాట్లు పూర్తి

నేటి మధ్యాహ్నం 12 గంటల వరకే భక్తులకు అనుమతి

తిరుమల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలో శనివారం నిర్వహించనున్న కుమారధార తీర్థ ముక్కోటికి టీటీడీ ఏర్పాట్లు పూర్తిచేసింది. ఉదయ 5.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే భక్తులను అనుమతించనున్నారు. అధిక బరువు, ఆస్తమా, గుండె సంబంధిత సమస్యలు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులున్న వారు, చిన్నపిల్లలు, వృద్ధులకు అనుమతి లేదని టీటీడీ స్పష్టం చేసింది. గోగర్భం నుంచి పాపవినాశనం వరకు ఆర్టీసీ బస్సుల్లో మాత్రమే భక్తులను అనుమతించనున్నారు. ట్రాఫిక్ దృష్ట్యా ప్రైవేట్‌వాహనాల అనుమతిని రద్దుచేశారు. మార్గమధ్యంలో భద్రత, తాగునీరు, ఆహార పదార్థాలను అందుబాటులో ఉంచారు. అత్యవసర పరిస్థితుల్లో భక్తుల కోసం అంబులెన్స్‌లు, డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది, అవసరమైన మందులను అందుబాటులో ఉంచారు. శుక్రవారం తిరుమలలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో భద్రతా ఏర్పాట్లపై తిరుమల ఏఎస్పీ శివరామ రెడ్డి, వీజీవోలు నందకిశోర్, గిరిధర్, విజిలెన్స్ పోలీసు అధికారులు సమీక్షించారు.

స్కూల్ వ్యాన్ కిందపడి చిన్నారి దుర్మరణం



సాత్విక (ఫైల్ ఫొటో)

ఐరాల, ఫిబ్రవరి 23: స్కూల్ వ్యాన్ కిందపడి ఓ చిన్నారి దుర్మరణం చెందిన సంఘటన గూబలవారిపల్లెలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పాకాల మండలం దామలచెరువుకు సమీపంలోని గూబలవారిపల్లె చెందిన శ్రీహరి, లక్ష్మీదేవి దంపతులకు మోక్షశ్రీ, సాత్విక (5) ఇద్దరు సంతానం. శుక్రవారం ఉదయం మోక్షశ్రీని పాఠశాలకు పంపేందుకు అమ్మమ్మ రాజమ్మ స్కూల్ వ్యాను వద్దకు తీసుకొచ్చింది. వ్యానులోకి పాపను ఎక్కిస్తుండగా సాత్విక కూడా వచ్చింది. ఆ తర్వాత వ్యాను వెనుక చక్రం దగ్గరకు వెళ్లింది. ఈ విషయాన్ని అమ్మమ్మ, వ్యాను డ్రైవర్ గమనించలేదు. వాహనాన్ని ముందుకు నడపడంతో సాత్వికపైకి చక్రం ఎక్కేయడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దీనిపై ఐరాల పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

రేషన్‌కార్డు అడిగితే దాడి చేసిన వలంటీరు



గాయపడిన షేక్ షారుఖ్

చిట్టమూరు, ఫిబ్రవరి 23: తాను దరఖాస్తు చేసుకున్న రేషన్‌కార్డు ఏమైందని అడిగినందుకు వలంటీరు, అతడి సోదరులు విచక్షణారహితంగా దాడిచేసి గాయపరిచిన ఉదంతమిది. గాయపడ్డ ఆ వ్యక్తి పోలీసులను ఆశ్రయిస్తే అతడినే తప్పుబడుతూ భయపెట్టి సర్దుబాటు చేసి పంపిన ఈ ఘటన తిరుపతి జిల్లా చిట్టమూరు మండలం తాడిమేడు గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడి కథనం మేరకు... తాడిమేడుకు చెందిన షారూఖ్ ఆరునెలల క్రితం రేషన్‌కార్డు కావాలని సుమత్ అనే వలంటీరును అడిగాడు. రేషన్‌కార్డు లాగిన్ ప్రభుత్వం ఇంకా వదలలేదని రేషన్‌కార్డు ఇచ్చే సమయంలో తానే దరఖాస్తు చేస్తానని వలంటీరు చెప్పాడు. గురువారం రాత్రి ఇదే విషయమై షారుఖ్ వలంటీరును అడిగాడు. తనకు సంబంధం లేదని సచివాలయం వద్ద వెళ్లి అడగమని వలంటీరు సుమత్ చెప్పాడు. ఈ విషయంపై ఇద్దరి మధ్య వాదనలు చోటుచేసుకున్నాయి. అదే సమయంలో వలంటీరుతో పాటు అతడి సోదరులు ముగ్గురు షారూఖ్‌పై దాడిచేశారు. దీంతో షారూఖ్ తలపై బలమైన గాయమైంది. రక్తగాయాలతో షారూఖ్ చిట్టమూరు పోలీసులను ఆశ్రయించారు. అయితే పోలీసులు బాధితుడిని భయపెట్టి ఇద్దరి మధ్య రాజీ కుదిర్చి పంపినట్లు బాధితుడు తెలిపాడు. ఈ విషయంపై ఎస్ఐ చిన్నబలరామయ్యను వివరణ కోరగా వలంటీరును నిలదీసిన షారూఖ్‌దే తప్పని, సర్దుబాటు చేసి పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

తిరుమలలో పట్టుబడిన కొండ చిలువ



తిరుమల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శుక్రవారం ఓ భారీ కొండ చిలువ పట్టుబడింది. సేవాసదన్ వెనుకభాగంలోని అడవి నుంచి సుమారు 12 అడుగుల పొడవు కలిగిన కొండచిలువ జనసంచారంలోకి వచ్చింది. వెంటనే పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్ నాయుడు ఘటనా ప్రాంతానికి చేరుకుని దాన్ని పట్టుకుని దట్టమైన అడవిలో విడిచి పెట్టారు.

అన్నార్తులే మోతగాళ్లు...?

● అన్నదాన కేంద్రంలో పనిచేయని లిఫ్టు ● భక్తుల చేతే మోయించిన వేడి పాత్రలు
● నిద్రావస్థలో ముక్కంటి ఆలయ ఇంజనీరింగ్ వ్యవస్థ



వంటశాల నుంచి భోజన పాత్రలను మోసుకెళ్తున్న భక్తులు



పనిచేయని లిఫ్ట్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23 : శ్రీకాళహస్తీశ్వరాలయంలో అన్నార్తులైన భక్తులే మోతగాళ్లుగా మారారు.ఆలయంలోని నిత్యాన్నదాన మండపంలో భోంచేయడం ఈశ్వర ప్రసాదాన్ని స్వీకరించడంగా భక్తులు భావిస్తుంటారు.ఇక్కడ రోజుకు సుమారు 5000మంది భక్తులకు అన్న ప్రసాదం సరఫరా చేసేలా ఏర్పాటు చేశారు. కింద సెల్లార్ లోని వంటశాలలో వంటకాలను సిద్ధం చేస్తారు.వంట గదిలో నుంచి వాటిని మొదటి అంతస్తుకు లిఫ్ట్ ద్వారా తరలించాలి. సుమారుగా 200 సార్లు వేడివేడి వంటకాలను పాత్రలతో పైకి చేర్చాలి. అలాగే ఖాళీ అయిన పాత్రలను కిందకు తరలించుకోవాలి. అసలే అన్నదాన సత్రంలో సిబ్బంది కొరత ఉంది. దానికి తోడు మూడు నెలల నుంచి లిఫ్టు తరచూ మొరాయిస్తూనే ఉంది. వారం రోజుల నుంచి గోడల నుంచి లీకేజీల సమస్యతో లిఫ్ట్ పూర్తిగా పనిచేయడంలేదు.అప్పటినుంచి అన్నదాన సిబ్బందిపై వేడి పాత్రలు తరలించే అదనపు భారం పడింది. భక్తుల రద్దీ సమయంలో త్వరితగతిన పాత్రలను మొదటి అంతస్తుకు చేర్చాల్సి ఉంటుంది. దాంతో సిబ్బంది అన్నార్తులుగా వచ్చిన భక్తులనే సాయం పట్టండంటూ ప్రాధేయ పడాల్సి వస్తోంది. భారీ వేడి పాత్రలను భక్తుల సహాయంతో మొదటి అంతస్తుకు తీసుకెళుతున్నారు.

అదుపు తప్పితే ఎంత అప్రతిష్ట...?

వంట పాత్రలు బరువుతోపాటు వేడిగా కూడా ఉంటాయి. వాటిని భక్తులు మెట్ల మార్గంలో తీసుకెళ్లడం ప్రమాదకరంగా దర్శనమిస్తోంది.పాత్రలు అదుపుతప్పి పొరపాటున భక్తులపై పడితే శరీరం తీవ్రంగా గాయపడే ప్రమాదం వుంది. ఆలయంలో అన్న ప్రసాదం స్వీకరించేందుకు వచ్చిన భక్తులు ఎవరైనా ప్రమాదవశాత్తు గాయపడితే ఎంతటి అప్రతిష్టను మూట కట్టుకోవాల్సి వస్తుందో అర్థం కాని పరిస్థితి. ఆలయంలో పెద్ద ఎత్తున ఇంజనీరింగ్ వ్యవస్థ ఉంది. అయినా చిన్న లిఫ్ట్ సమస్యను ఎవరూ పట్టించుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఆదాయం చేకూరే పనుల్లో తప్ప ఇటువంటి వాటిపై ఇంజనీరింగ్ అధికారులు శ్రద్ధ చూపరని ఆలయ ఉద్యోగులే బాహాటంగా విమర్శిస్తున్నారు.



పశువులకు దాణా పెడుతున్న నారాభువనేశ్వరి

వరసిద్ధుడి సేవలో భువనేశ్వరి

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 23: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి శుక్రవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆమెను ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు. ఆమె వెంట మాజీమంత్రి అమర్నాథరెడ్డి, ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, ఎమెల్సీ దొరబాబు, ఆలయ మాజీ చైర్మన్ మణి నాయుడు, మాజీ సర్పంచ్ మధుసూదనరావు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుల సేవలు భేష్



హోంగార్డుకు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న మహేష్‌కుమార్

చిత్తూరు, ఫిబ్రవరి 23: శాంతి భద్రతల విషయంలో హోంగార్డుల సేవలు భేష్ అని కర్నూలు రేంజ్ హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్ అన్నారు. శుక్రవారం చిత్తూరులో నిర్వహించిన హోంగార్డు దర్బార్‌లో ఆయన ప్రసంగించారు. చిత్తశుద్ధితో పనిచేసి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ చూపిన వారికి ప్రశంసాపత్రాలను అందించారు. ఏఆర్ డీఎస్పీలు ఇలియాస్ బాష, మహబూబ్ బాషా, ఆర్ఐలు భాస్కర్, సుధాకర్, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.1.20లక్షల కర్ణాటక మద్యం స్వాధీనం

ఒకరి అరెస్టు, ద్విచక్రవాహనం సీజ్



నిందితుడు, మద్యాన్ని మీడియాకు చూపిస్తున్న డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

చిత్తూరు, ఫిబ్రవరి 23: కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.1.20 లక్షల మద్యంతో పాటు ఓ ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. వివరాలను టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఉలసయ్యతో కలిసి డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి శుక్రవారం మీడియాకు తెలియజేశారు. కొన్ని రోజులుగా మద్యం అక్రమ రవాణా, విక్రయాలపై నిఘా పెట్టారు. శుక్రవారం పోలీసులకు వచ్చిన సమాచారంతో ఇరువారం బ్రిడ్జి వద్ద వాహనాలను తనిఖీ చేశారు. టీపీనాయుడు వీధికి చెందిన అన్వర్(27)ను పట్టుకోగా.. పాండ్యా, లడ్డూలు పరారయ్యారు. పట్టుబడిన నిందితుడి నుంచి రూ.1.20 లక్షల విలువ చేసే కర్ణాటక మద్యం, రూ.30వేల విలువైన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. పరారీలోని మిగతా ఇద్దరినీ త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. నిందితుడిని పట్టుకున్న రెండో పట్టణ పోలీసులను డీఎస్పీ అభినందించారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

మర్రికొండ అగ్నికి ఆహుతి

● సుమారు 500 హెక్టార్లకు పైగా అడవి దగ్ధం



మంటలకు కాలిబూడిదైన అటవీ ప్రాంతం

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 23: తంబళ్లపల్లెకు సమీపంలోని మల్లయ్యకొండకు ఆనుకుని ఉన్న మర్రికొండ అటవీ ప్రాంత సముదాయాలు అగ్నికి ఆహుతి అయ్యాయి. గురువారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు దండువారిపల్లె ఏకుల గుట్టకు నిప్పు పెట్టటంతో అవి క్రమంగా పెద్ద ఎత్తున చెలరేగి శుక్రవారానికి మర్రికొండకు వ్యాపించాయి. దీంతో మర్రికొండ అటవీ ప్రాంత సముదాయాల్లో ఉన్న మరాలు, నక్కలోల్లగుట్ట, ఎర్రకొండ, సీకిరాళ్లు, తాతబావి, గంగమ్మగుట్ట తదితర ప్రాంతాలు కలిపి సుమారు 500 హెక్టార్లకు పైగా అగ్నికి ఆహుతి అయినట్లు తెలుస్తోంది. వందల ఎకరాల్లో అడవి కాలిపోవటంతో పలు రకాల జాతులకు చెందిన వృక్ష సంపదతో పాటు వన్యప్రాణులు మంటలకు మాడి మసైపోయాయి. కొంత మంది ఆకతాయిలు అడవికి నిప్పు పెట్టడం వలన విలువైన ఔషద మూలికలతో పాటు జీవనోపాధి లభించే ఫల సంపద నిచ్చే చెట్లు కాలిపోతున్నాయి. అంతేకాకుండా మూగ జీవాలకు మేతగా ఉపయోగపడే బోద, అడవి గడ్డి కాలి బూడిదైపోయింది. మంటలను ఆర్పడానికి అటవీ సిబ్బందితో పాటు స్థానిక రైతులు శ్రమిస్తున్నారు. కాగా, గురువారం సాధుకొండకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో సుమారు 150 హెక్టార్లకు పైగా అడవి కాలిపోయింది. వెంటనే అటవీ సిబ్బంది అప్రమత్తమై మంటలను ఆర్పివేశారు.

బండరాయి జారిపడి వృద్ధుడి మృతి

బి కొత్తకోట,ఫిబ్రవరి 23: ప్రమాదవశాత్తు బండరాయి జారిపడి గుర్రప్ప(60)అనే వృద్ధుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం బి.కొత్తకోటలో జరిగింది. మండలంలోని కోటావూరు పంచాయతీ బిళ్లూరివాండ్లపల్లె వద్ద ఓ కొండలో రాళ్లుకొట్టుకొని కర్నాటక రాష్ట్రం మైసూరు నుంచి వచ్చి ,కొన్ని కుటుంబాలు ఏళ్లతరబడి జీవనం సాగిస్తున్నాయి. వారిలో ఓ కుటుంబం యథాప్రకారం శుక్రవారం కొండలో పనులు చేస్తుండగా ఓ పెద్దబండరాయి గుర్రప్పఅనే వృద్ధుడిపై పడింది. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబీకులు అతనిని హుటాహుటిన మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే పరిస్థితి విషమించడంతో అతను మృతిచెందాడు. కాగా ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు అందలేదన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 23: విద్యాహక్కు చట్టం ప్రకారం 2024-25 విద్యా సంవత్సరంలో ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో ఉచిత ప్రవేశం పొందడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న అనాథ, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాల పిల్లలు ప్రవేశాలకు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు మార్చి 14వ తేదీ లోగా ఆధార్, ప్రాథమిక వివరాలతో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూసీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. అర్హులైన విద్యార్థులను లాటరీ ద్వారా ఎంపిక చేస్తారని తెలిపారు.

బి.కొత్తకోటలో: ప్రైవేటు పాఠశాలల్లో ఒకటవ తరగతిలో 25శాతం ఉచిత ప్రవేశాలకు అవకాశం కల్పించే విద్యాహక్కు చట్టం 2009 పోస్టర్లను ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాల వద్ద శుక్రవారం అధికారులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవోలు రెడ్డిశేఖర్, భీమేశ్వరాచారి లు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలో ఉచిత ప్రవేశాలకు ఉన్న ఈ అవకాశాన్ని ఆసక్తిగల విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాఠ్యాంశాలను సులభరీతిలో బోధించాలి



రికార్డులను పరిశీలిస్తున్న రామకృష్ణ

కలకడ, ఫిబ్రవరి 23:పాఠ్యాంశాలను విద్యార్థులకు సులభరీతిలో బోధించాలని రాష్ట్ర స్థాయి అభ్యసన అభివృద్ధి కమిటీ తనిఖీ అధికారి రామకృష్ణ సూచించారు. శుక్రవారం ఆయన కమిటీ సభ్యులతో కలిసి ఆదర్శ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను గమనించారు. అనంతరం రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడారు.

నైపుణ్యాలతో మెరుగైన ఉద్యోగావకాశాలు



శిక్షణాతరగతులకు హాజరైన విద్యార్థులు

కురబలకోట, ఫిబ్రవరి 23: విద్యార్థులు నైపుణ్యాలను ప్రదర్శిస్తే మెరుగైన ఉద్యోగావకాశాలను సొంతం చేసుకోవచ్చని నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి హరికృష్ణ పేర్కొన్నారు. మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ద్వితీయ, తృతీయ సంవత్సరానికి చెందిన 250మంది విద్యార్థులకు శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ప్రతి రంగానికి ఉజ్వల భవిష్యత్ ఉందని ఆయా రంగంలో రాణిస్తే మెరుగైన ఉద్యోగావకాశాలను సాధించవచ్చునన్నారు. విద్యార్థులు శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యువరాజ్, శిక్షణానిపుణులు ఉమారావు, ప్రసన్న లక్ష్మీ, కో ఆర్డినేటర్ తురైరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య కళాశాలకు న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 23: మదనపల్లె సమీపంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలకు న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ గుర్తింపు వచ్చిందని డైరెక్టర్ రామలింగారెడ్డి పేర్కొన్నారు. ఈనెల 16, 17 తేదీల్లో న్యాక్ సభ్యులు కళాశాలను పరిశీలించి ఇక్కడి విద్యాబోధన, ప్లేస్‌మెంట్స్, కెరియర్ కౌన్సెలింగ్, కంప్యూటర్, మెకానికల్, ఎలక్ట్రికల్ ల్యాబ్‌లు పరిశీలించారన్నారు. న్యాక్ బృందంలోని ముగ్గురు సభ్యులు నివేదికలను పంపించగా ఈ క్రమంలో శుక్రవారం తమ కళాశాలకు న్యాక్ ఏ ప్లస్ గుర్తింపు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కళాశాల ఛైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, అధ్యక్షుడు నాగమల్లారెడ్డి, ప్రిన్సిపాల్ సతీష్‌బాబు హర్షం వ్యక్తం చేశారు.

రేపు పీలేరులో బ్యాడ్మింటన్ టోర్నీ

పీలేరు, ఫిబ్రవరి 23: పీలేరులో పురుషుల విభాగంలో అంతర జిల్లా బ్యాడ్మింటన్ టోర్నమెంటు ఈ నెల 25న ఏర్పాటు చేసినట్లు నిర్వాహకుడు, ప్రముఖ దంత వైద్య నిపుణుడు రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. పీలేరు పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో జరిగే ఈ టోర్నమెంటులో చిత్తూరు, అన్నమయ్య జిల్లాల క్రీడాకారులు పాల్గొనవచ్చని, ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.7 వేలు, తృతీయ బహుమతిగా రూ.5 వేలు, చతుర్థ బహుమతిగా రూ.3 వేలు అందిస్తామని ఆయన వివరించారు. ఆసక్తి గల క్రీడాకారులు 9849635610 నెంబరును సంప్రదించాలని ఆయన తెలిపారు.

తలనీలాల వేలం మళ్లీ వాయిదా

● వేలం పాటల నిర్వహణపై ప్రచారం ఎక్కడ..?

● అధికారుల తీరుపై భక్తుల పెదవి విరుపు



తలనీలాలకు వేలం పాటను నిర్వహిస్తున్న దేవదాయశాఖ అధికారులు

గుర్రంకొండ, ఫిబ్రవరి 23:రెడ్డెమ్మకొండ ఆలయంలో భక్తుల అమ్మవారికి మొక్కుగా సమర్పించే తల నీలాలకు దేవాదాయశాఖ అధికారులు నిర్వహించే వేలం పాట మళ్లీ వాయిదా పడింది.. ఇప్పటికే అమ్మవారి తల నీలాలకు రెండు సార్లు దేవాదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో వేలం పాటలను నిర్వహించారు. ఈ రెండు వేలం పాటలు వాయిదా పడడంతో మూడవ సారైన ఆటంకం లేకుండా వేలం జరిగేనా..?లేక తక్కువ పాటకే తల నీలాల వేలంను కుదిస్తారా! అన్న భక్తుల సందేహాల నడుమ మూడోసారి కూడా వేలం పాట వాయిదాపడింది. గుర్రంకొండ మండలం చెర్లోపల్లె రెడ్డెమ్మ అమ్మవారు సంతాన లక్ష్మీగా ప్రసిద్ధి. దీంతో సంతానం లేని మహిళలు సంతానం కోసం వరపడుతారు. ఈ క్రమంలో అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కుగా తలనీలాలను సమర్పిస్తారు. తల నీలాలు సమర్పించే మహిళల్లో ఎక్కువ మంది 20 నుంచి 30 ఏళ్ల లోపు వారు కావడంతో దీంతో వారి తల నీలాలకు బయట మంచి గిరాకీ ఉంటుంది. ఈ క్రమంలో అమ్మవారి తల నీలాలు వేలం పాటను దక్కించుకోవడానికి అధిక సంఖ్యలో వ్యాపారులు పాల్గొంటారు. గత ఏడాది అమ్మవారి తల నీలాలను కడప జిల్లాకు చెందిన వ్యక్తి రూ.27 లక్షలకు దక్కించుకొన్నాడు. ఆ గడుపు ముగియడంతో జనవరి, ఫిబ్రవరి నెలలో అమ్మవారి తలనీలాలు ప్రోగు చేసుకోవడానికి వేలం పాటలను నిర్వహించారు. ఈ ఏడాది జనవరి 31వ తేదీన నిర్వహించిన వేలం పాటలకు వ్యాపారులు ఎవరూ రాలేదు. దీంతో వేలం పాటను వాయిదా వేశారు. మరోమారు ఫిబ్రవరి 13వ తేదీన తల నీలాలకు వేలం పాటలను నిర్వహించగా కొంత మంది మాత్రమే హాజరైయ్యారు. ఈ క్రమంలో తల నీలాలకు నిర్వహించి వేలం పాటలో రూ.15.50 లక్షలు పాడారు. గత ఏడాది కంటే తక్కువ పాట రావడంతో వేలం పాటను వాయిదా వేసినట్లు ఈవో మంజుల, ఛైర్మన్ నరసింహారెడ్డి తెలిపారు. కాగా ఈనెల23న (శుక్రవారం) వేలం పాట నిర్వహించిన వేలం పాటను రూ.10లక్షలతో ప్రారంభించాలని వ్యాపారులు కోరడంతో గతంలో కన్నా తక్కువ ఆదాయం వస్తుందని వేలంపాటను తిరిగి మార్చి 2వ తేదీకి వాయిదా వేసినట్లు ఈవో మంజుల తెలిపారు.

తల నీలాల వేలం పాటలపై ప్రచారం ఎక్కడా..?

గుర్రంకొండ మండలం చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆలయంలో అమ్మవారికి ఆదాయ వనరులైన వివిధ వేలం పాటల నిర్వహణపై దేవాదాయశాఖ అధికారులు తగిన ప్రచారం కల్పించడం లేదని స్థానికులు, భక్తులు ఆరోపిస్తున్నారు. అమ్మవారి ఆలయంలో నిర్వహించే వేలం పాటలకు సంబంధిత వ్యాపారులు రావడం లేదని ప్రచారం సాగుతోంది. గతంలో అమ్మవారి తల నీలాలకు భారీగా వ్యాపారులు పోటీ పడేవారు. దీంతో దేవాదాయశాఖ అధికారుల అంచనాలకు మించి ఆదాయం వచ్చేది. ఈ క్రమంలో అమ్మవారి ఆలయంలో జరిగే వివిధ రకాల వేలం పాటలు స్థానికులకు కూడా తెలియకుండానే చడిచప్పుడు లేకుండా ముగిస్తున్నారని విమర్శలకు వ్యక్తమవుతున్నాయి.

నలవీరగంగాభవానీ జాతరకు సర్వం సిద్ధం



అలంకరణలో నలవీరగంగాభవాని, విద్యుత్ వెలుగుల్లో ఆలయం

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 23: కోరిన కోర్కెలను తీర్చే కల్పవల్లిగా పేరుగాంచిన మదనపల్లె మండలం సీటీఎంలో వెలసిన నలవీరగంగాభవానీ జాతరకు సర్వంసిద్ధమైంది. జాతర శనివారం నుంచి మంగళవారం వరకు అంగరంగవైభవంగా జరుగుతంది. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతిఏటా పౌర్ణమి మరుసటి రోజు నుంచి జాతరను నిర్వహిస్తారు. సీటీఎం, సీటీఎం క్రాస్, కొత్తవారిపల్లె, దుబ్బిగానిపల్లె పంచాయతీల్లోని 120 గ్రామాల్లో జాతరను వేడుకగా చేస్తారు. ఇది రాయలసీమలోనే తొలి జాతరగా ఘనంగా నిర్వహిస్తారు. జాతరకు ఈ గ్రామాల ప్రజలే కాకుండా పొరుగు జిల్లాలు చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, అనంతపురం, నుంచే కాకుండా ఇతరరాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక,తెలంగాణా రాష్ట్రాల నుంచి కూడా అధిక సంఖ్యలో జాతరకు భక్తులు విచ్చేస్తారు. శనివారం ఉదయం మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, రాత్రి పది గంటలకు అమ్మవారు ఆలయప్రవేశం, 25న సిద్దుల భక్తి, అమ్మవారి ఊరేగింపు, 26న రాత్రితిరుణాల, 27న పగలు తిరుణాల 28న దోపుతిరుణాలతో జాతర ముగుస్తుంది. దీంతోపాటు 28 నుంచి ఎద్దుల పరుష ఏర్పాటు చేస్తారు, అది ఘనంగా జరుగుతుంది. సీటీఎంకు ఆర్టీసీ బస్సులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు డీఎం మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆలయకమిటీ సభ్యులు సీటీఎం సర్పంచ్ సగినాల ఆనందపార్థసారథి, వెలుగచంద్ర, పారపట్ల సురేంద్రరెడ్డి, పోగాకు వీరప్రతాప్‌లు కార్యక్రమాలను పర్యవేక్షించనున్నారు.

కామాక్షి అమ్మవారికి వెండి కిరీటం వితరణ



కలకడ, ఫిబ్రవరి 23:కలకడ సిద్దేశ్వర ఆలయంలో కొలువైన కామాక్షి అమ్మవారికి రిటైర్డ్ హెచ్ఎం లక్ష్మీరెడ్డి, జయప్రదదేవి దంపతులు వెండి కిరీటాన్ని శుక్రవారం ఆలయంలో ధర్మకర్త అఖిలేష్‌కు అందజేశారు. అర్చకులు సుబ్రమణ్యం స్వామి ప్రత్యేక పూజలు చేసి కిరీటాన్ని అమ్మ వారికి అలంకరించారు. కార్యక్రమంలో కొనేని రెడ్డెప్పనాయుడు, లక్ష్మీశ్రీనివాసప్రసాద్, రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం



కలకడ,ఫిబ్రవరి 23: మండలంలోని ఎర్రకోటపల్లి గ్రామంలో కొలువైన కోటమిట్ట ఆంజనేయ స్వామి ఆలయానికి శుక్రవారం దాత విరాళం అందజేసినట్లు ధర్మకర్త భానుప్రసాద్ తెలిపారు. గ్రామనికే చెందిన ముష్టురి రమణయ్య ఆయన భార్య శ్యామలమ్మ జ్ఞాపకార్థం రూ. 30,001 ఇచ్చినట్లు తెలిపారు. ఈ నిధులను ఆలయ అభివృద్ధికి విని యోగిస్తామని ధర్మకర్త పేర్కొన్నారు.

అక్కదేవతలకు ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, ఫిబ్రవరి 23:మండలంలోని మర్రిపాడు సమీపంలోని అక్కదేవతల గుడిలో అమ్మవార్లకు శుక్రవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అక్కదేవతల పెద్ద పూజ సందర్భంగా అమ్మవారి మొక్కుగా భక్తులు మట్టి గుర్రాల బొమ్మలను తెచ్చి గ్రామంలో ఊరేగించారు. అక్కదేవతల పూజ కార్యక్రమాన్ని నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు పాల్గొన్ని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

విద్యార్థులు ఆరోగ్య సూచనలు పాటించాలి

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 23: విద్యార్థులు తప్పని సరిగా ఆరోగ్య సూచనలు పాటించాలని వైద్యాధికారి రమేష్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రెడ్డివారిపల్లి ఆదర్శపాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నం తినేటప్పుడు శుభ్రంగా సబ్బుతో చేతులు కడగాలన్నారు. వీటితో పాటు ప్రతి రోజు వ్యాయామం ఎంతో ముఖ్యమని తెలిపారు. అనంతరం పాఠశాలోని విద్యార్థులకు పలు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది దేవకుమారి, కిరణ్, ఆశాలు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమించిన ఆస్పత్రులపై చర్యలేవి..?

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 23: మదనపల్లెలో ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించిన ప్రైవేటు ఆస్పత్రులపై జిల్లా వైద్యశాఖ అధికారులు చర్యలు చేపట్టకపోవడం బాధాకరమని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బహుజన యువసేన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఉషశ్రీ మదనపల్లెకు వచ్చి ప్రైవేటు ఆస్పత్రుల యజమాన్యాలతో సమావేశం నిర్వహించి, ప్రభుత్వ నియమ, నిబంధనలు గురించి వివరించారే కానిస్కానింగ్‌సెంటర్లు, ల్యాబ్‌లు పరిశీలనపై దృష్టి పెట్టలేదన్నారు. ప్రభుత్వాస్పత్రిలో చూస్తే ఎక్స్‌రే యంత్రం, స్కానింగ్ యంత్రాలు పనిచేయడం లేదని, ఇక్కడి సిబ్బంది రోగులను ప్రైవేటు స్కానింగ్ సెంటర్లకు సిఫారసు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీవైఎస్ నేతలు సతీష్, హరీష్, సుధాకర్, నవీన్, దేవేష్ పాల్గొన్నారు.

మీడియాపై దాడి అనాగరికం



మీడియాపై దాడిని నిరసిస్తూ రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 23: పత్రిక కార్యాలయాలపైనా, పాత్రికేయులపైనా భౌతికమైన దాడులకు పాల్పడడం అనాగరికమని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మదనపల్లె పట్టణంలో మీడియాపై దాడిని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారాకో నిర్వహించారు. మీడియాపై దాడిని ఖండించాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, మీడియాపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్ అరాచక పాలనకు అడ్డులేకుండా పోతుందనడానికి ఈ సంఘటనలే కారణమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హరిశర్మ, ప్రభాకర్‌రెడ్డి, నాగరాజ, సురేంద్ర, రఘునాథ్, నారాయణ, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెపై టీడీపీ జెండా రెపరెపలాడిస్తాం



జయచంద్రారెడ్డికి స్వాగతం పలుకుతున్న టీడీపీ నేతలు

ములకలచెరువు/బి.కొత్తకోట, ఫిబ్రవరి 23: తంబళ్లపల్లె నియోజకవర్గ గడ్డపై టీడీపీ జెండా రెపరెపలాడిస్తామని నియోజకవర్గ టీడీపీ నేత, ప్రముఖ పారిశ్రామికవేత్త దాస రిపల్లె జయచంద్రారెడ్డి పేర్కొ న్నారు. టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిసిన అనంతరం ఆయన శుక్రవారం కురబలకోట మండలం అంగళ్ళు, గట్టు, బి.కొత్తకోట మీదు గా భారీ ర్యాలీగా ములకలచెరువులోని ఆయన స్వగృహానికి చేరుకు న్నారు. ఈ క్రమంలో ఆయనకు మద్దతుదారులు, నాయకులు ఘన స్వాగం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించి చంద్రబాబుకు బహుమతిగా ఇస్తామన్నారు. నియోజకవర్గమంతా విస్తృతంగా పర్యటించి ప్రతి నాయకుడు, కార్యకర్తలను కలుస్తానన్నారు. కార్యక్రమాల్లో నాయకులు మంత్రి గిరిధర్‌రెడ్డి, ఆంజనేయరెడ్డి, మస్తాన్‌రెడ్డి, ఫజురుల్లా, చావిడి కిట్టన్న, ప్రభాకర్, రమణ, బీరంగి సుబ్బన్న, శ్రీనివాసులు, శంకర, శివరాంరెడ్డి, మంజునాథరెడ్డి. బీరంగి వెంకటేశ్, మదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణమాదిగ సమావేశానికి తరలిరండి

ములకలచెరువు, ఫిబ్రవరి 23: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ అధ్యక్షతన తిరుపతిలో ఈనెల 27వతేదీన జరిగే సమావేశానికి తరలిరావాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు ప్రతాప్‌కుమార్, కో ఇన్‌చార్జి తిరుపాల్, ఎంఎస్పీ జిల్లా నాయకుడు వెంకటప్ప పిలుపునిచ్చారు. ములకలచెరువులో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మందకృష్ణమాదిగ తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు చెందిన నాయకులతో సమావేశమవుతారన్నారు. కావున సమావేశానికి తంబళ్లపల్లె నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి నాయకులు విధిగా హాజరుకావాలన్నారు. సమావేశంలో నాయకులు నారాయణ, పెద్దన్న, ప్రసాద్, నాయుడు, క్రిష్ణప్ప, మల్లికార్జున, రాఘవ, సురేంద్ర పాల్గొన్నారు.

ఆసరా చెక్కులు పంపిణీ

పెద్దమండ్యం, ఫిబ్రవరి 23: పెద్దమండ్యం ఎంపీడీవో కార్యాల యం వద్ద శుక్రవారం ఆసరా చెక్కులను వెలుగు మహిళా సంఘాలకు తంబళ్లపల్లి ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి పంపిణీ చేశారు. కలిచెర్ల సింగిల్‌విండో ఛైర్మన్ కడప సుధాకరరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, ఎంపీపీ పూర్ణచంద్రిక రమేష్, జడ్పీటీసీ పీరమ్మ, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలను వినియోగించుకోండి

కలకడ, ఫిబ్రవరి 23:ఫ్యామిలీ డాక్టర్ విధానంలోని వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని దిగువతాండలో గ్రామస్థులు 92 మందికి సిబ్బందితో కలిసి వైద్య పరీక్షలు చేశారు. వారికి మందులు పంపిణీ చేసి ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

కొత్తగా మంజూరైన రేషన్‌కార్డులు పంపిణీ

బి.కొత్తకోట,ఫిబ్రవరి23: బి. కొత్తకోట నగర పంచాయతీ 1వ సచివాలయ పరిధిలో కొత్తగా మంజూరైన రేషన్‌కార్డులను నగర పంచాయతీ కమిషనర్ పీఎస్ మనోహర్ శుక్రవారం లబ్ధి దారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ రమాదేవి, ఏఈ రాజశేఖర్, వీఆర్వో అమరనారాయణ, వెల్ఫేర్ మౌలా, మహిళా పోలీస్ సుమతి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కొత్త కార్డుల పంపిణీ

కలికిరి, ఫిబ్రవరి 23: మండలంలోని గుండ్లూరు పంచాయతీలో శుక్రవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో కొత్త ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. సర్పంచు సైపుల్లా, ఎంపీడీవో రామకృష్ణయ్య ఈ వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి హాజరైన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ కావ్యగంధ, జావీద్, ఈవోఆర్డీ పరశురామ్, పంచాయతీ కార్యదర్శి రెడ్డిప్రసాద్, రిసోర్స్ కోఆర్డినేటర్ శంకర్, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యం

కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్

మదనపల్లె, ఫిబ్రవరి 23: వచ్చే సాధారణ ఎన్నికల్లో తంబళ్లపల్లెలో టీడీపీ జెండా ఎగురవేయడమే కాకుండా చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేస్తామని తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు, పెద్దసంఖ్యలో హాజరైన నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌యాదవ్ మాట్లాడుతూ ఈ నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో దాడులు, దౌర్జన్యాలను ఎదుర్కొని ప్రజలకు చేరువైనట్లు తెలిపారు. వైసీపీ ఓటమి ఖాయమైన నేపథ్యంలో కోవర్టులను టీడీపీలోకి పంపి, టికెట్ వచ్చేసిందనే ప్రచారంలో నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. ఎక్కడ నుంచో వచ్చిన వ్యక్తులు డబ్బులు విచ్చలవిడిగా ఖర్చు పెడతామని చెబుతున్నారని, దీనికి క్యాడర్ ఎవరూ సహకరించే పరిస్థితి లేదన్నారు. పార్టీ ఎప్పుడూ ప్రజల, క్యాడర్ మనోభావాలను పరిగణలోకి తీసుకుంటుందని, ఇలాంటి వాటిని నమ్మకుండా ధైర్యంగా ముందుకెళ్లాలని పార్టీ క్యాడర్‌కు శంకర్ యాదవ్ స్పష్టం చేశారు. సమావేశంలో తంబళ్లపల్లె, బి.కొత్తకోట, కురబలకోట, ములకలచెరువు, పీటీఎం, పెద్దమండ్యం మండలాల పార్టీ అధ్యక్షులు రెడ్డెప్పరెడ్డి, నారాయణస్వామిరెడ్డి, వైజీ సురేంద్ర, పాలగిరి సిద్దా, ఆనంద్‌రెడ్డి, వెంకటరమణ, పార్టీ సీనియర్ నేతలు శ్రీనాథ్‌రెడ్డి, భూమిరెడ్డి, మొటుకు శివ, తెలుగుయువత శ్రీనాథ్‌రెడ్డి, కుడుం శ్రీనివాసులు, వైజి రమణ, శ్రీనివాసులుయాదవ్, నాటరాజనాయక్, బిక్కా మధుకర్ పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా చేరికలు



కదిరాయచెరువు నుంచి కిశోర్‌కుమార్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్న నాయకులు

కలికిరి, ఫిబ్రవరి 23: కడకడ, కేవీపల్లె మండలాల నుంచి టీడీపీలోకి భారీగా వచ్చి చేరుతున్నారు. తాజాగా శుక్రవారం కలకడ మండలం కదిరాయచెరువు పంచాయతీ నుంచి నగరిపల్లెలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కిశోర్‌కుమార్‌రెడ్డి సమక్షంలో పెద్ద సంఖ్యలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ ఆయన పసుపు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కదిరాయచెరువు సర్పంచు లక్ష్మీప్రసన్న, మాజీ సర్పంచు విశ్వనాథం చెట్టి ఆధ్వర్యంలో వైసీపీ ప్రధాన నాయకుడు గౌరవం శ్రీనివాసులుతో సహా రామయ్య, శ్రీకాంత్, శ్రీరాములు, నాగరాజ, ఆంజనేయులు, సయ్యద్ బాషా, కృష్ణ, జయేంద్ర, ఆంజనేయులు, వార్డు సభ్యుడు వెంకటాచలపతి, రామచంద్ర (రామ), వెంకటేశ్వర, శరత్‌కుమార్, మోహన, ఎల్లప్ప, రామయ్య, వెంకట్రమణ, కిరణ్, కల్యాణ్, రెడ్డిశేఖర్, శ్రీనివాసులు, శివన్న తదితరులు టీడీపీలో చేరిన వారిలో వున్నారు. కేవీపల్లె మండలం సొరకాయలపేట పంచాయతీ నుంచి గురువారం రాత్రి పలువురు మండల టీడీపీ అధ్యక్షురాలు గీతాంజలి, మాజీ సర్పంచు మోటుపల్లె సుధాకర్ నాయుడు, గోరంట్లపల్లె సర్పంచు కృష్ణయ్యల ఆధ్వర్యంలో సురేష్ రెడ్డి, విశ్వనాథ రెడ్డి, శివరాజప్ప, వెంకటేష్, గణేష్, సురేంద్ర, రెడ్డిశేఖర్, నాగరాజ, మంజునాథ, నరసింహ నాయుడు, సుదర్శన్, శివరామ్, రామకృష్ణ, దొరస్వామి, నాగరాజ, వెంకటయ్య, రెడ్డెప్ప నాయుడు, మల్లేశ్వర, చలపతి తదితరులు టీడీపీలో చేరారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో పెట్రోలు బంకు ప్రారంభం

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 23: మదనపల్లెలో ఆర్టీసీ ఆధ్వర్యంలో శుక్రవారం భారత్ పెట్రోలియం బంకును ఆర్టీసీ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఆర్టీసీ ఎండీ ద్వారకతిరుమలరావు, డైరెక్టర్ రాజారెడ్డిలు ప్రారంభించారు. అనంతరం మదనపల్లె బస్టాండ్ పరిసరాలను గ్యారేజ్‌ను, అక్కడే ఉన్న ఎలక్ట్రికల్ బస్సు రీచార్జ్ పాయింట్‌ను పరిశీలించారు. బస్టాండ్‌లోని కార్గో పాయింట్‌ను తనిఖీ చేశారు. అనంతరం ఆర్టీసీ ఉద్యోగులతో సమావేశమై రీజియన్‌లో మదనపల్లె ఆర్టీసీ వన్‌డిపో అన్ని పెరామీటర్లలో ప్రథమస్థానం సాధించిందని వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డిని అభినందించి ఉత్తమ డీఎంగా ప్రశంసాపత్రాన్నిప అందించారు. ఆర్టీసీ ఉత్తమ ఉద్యోగులను గుర్తించి వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కడప ఈడీ గిడుగు వేంకటేశ్వరరావు, అన్నమయ్యజిల్లా డీపీటీవో రాము, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనుజా, యూనియన్ గౌరవాధ్యక్షుడు వరదారెడ్డినారథరెడ్డి, డిపో అసిస్టెంట్ మేనేజర్లు రేవతి, గీత, సూపర్‌వైజర్లు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

వైసీపీ ఇన్‌చార్జి నిస్సార్‌కు మైనార్టీల నిరసన సెగ

రామసముద్రం, ఫిబ్రవరి 23: మదనపల్లె నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి మండల మైనార్టీల నుంచి నిరసన సెగ తగిలింది. మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం కింద చెక్కుల పంపిణీ, అలాగే గ్రామ వలంటరీలకు సేవా బహుమతులు అందజేయడాకిని నిస్సార్ శుక్రవారం మండలానికి విచ్చేశారు. చెక్కుల పంపిణీ తర్వాత ముస్లింలను కలవడానికి దిగువపేటలోని మసీదుకు వెళ్లగా ఈసందర్భంగా ముస్లింలు తమ సమస్యలను చెప్పుకున్నారు. మండల కేంద్రంలో ఏడువందల కుటుంబాలు, సుమారుగా రెండువేల ఐదు వందల ఓటర్లు ఉన్న మైనార్టీలకు వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి సమస్యలు ఏవీ పరిష్కారించలేదన్నారు. మైనార్టీల శ్మశాన వాటిక ప్రహరీ కోసం సుమారు రూ.10లక్షలు అనుమతులు మంజూరైనా స్థానిక మండల నాయకులు వాటిని ఇంతవరకు తమకు అందించలేదని చెప్పారు. షాదిమహల్ నిర్మాణం కోసం మూడు పర్యాయాలు ముగ్గురు ఎమ్మెల్యేలు పునాది రాళ్లు వేసి కాలయాపన చేస్తున్నారని వివరించారు. అలాగే దిగువపేటలో తాగునీటి కోసం ఫిల్టర్ వాటర్ ట్యాంక్ కోసం పలు మార్లు అధికారులకు, నాయకులకు విన్నవించినా ఫలితం లేదని తెలిపారు. తమ సమస్యలుపరిష్కరించలేదని వారికి తమను ఓటు అడిగే హక్కు లేదని వారు స్పష్టం చేశారు.

రైతుల ప్రాణాలు తీస్తున్న బీజేపీని గద్దె దించుదాం



స్థానిక మార్కెట్‌యార్డు వద్ద నిరసన చేస్తున్న కార్మికసంఘాల నాయకులు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 23: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులపైనా విరుచుకుపడి వారి ప్రాణాలను తీస్తోందని వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీని గద్దెదించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణప్ప, సీపీఎం కార్యదర్శి శ్రీనివాసులు, సీఐటీయూ ఉపాధ్యక్షుడు హరినాథ్‌శర్మలు పిలుపుని చ్చారు. హర్యానా పోలీసులు యువరైతును ప్లాస్టిక్‌బుల్లెట్లతో కాల్చిచంప డాన్ని ఖండిస్తూ రైతుల ఆందోళనలకు సంఘీభావం తెలుపుతూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్‌యార్డు వద్ద ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఢిల్లీ హర్యానా సరిహద్దులో సమస్యలపై ఆందోళన చేస్తున్న రైతులపై పోలీసులు పాశవికంగా నిర్వహించిన దాడిలో రైతు శుభ్‌కరణ్‌సింగ్ మృతిచెందాడని ఇందులకు కారణమైనవారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు రెడ్డెప్ప, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సురేష్ కుమార్, మస్తాన్, గోపాల్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, నారాయణబాబు, చంద్రశేఖర్, అయూబ్, నరసింహులు, కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ పనులపై సామాజిక తనిఖీ



వాటర్‌షెడ్ పనులపై వివరాలను వెల్లడిస్తున్న సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పీ

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 23: మదనపల్లె, నిమ్మనపల్లె మండలాల్లో జరిగిన వాటర్‌షె డ్ పనులపై సామాజిక తనిఖీ నివేదికలను వెల్లడించారు. శుక్రవారం స్థానిక సీఎల్ ఆర్‌సీ భవనంలో డ్వామా పీడీ మద్దిలేటి సమక్షంలో వాటర్‌షెడ్ పనులపై సామాజిక తనిఖీ బృందం నివేదికలను చదివి వినిపించారు. మదనపల్లె మండలం కొత్తవారిపల్లె మెగా వాటర్‌షెడ్ పరిధిలోని 5 గ్రామపంచా యతీల్లో 72 నీటి కుంటల పనుకు రూ.1.23 కోట్లు ఖర్చు చేశారన్నారు. నిమ్మనపల్లె మండలం రెడ్డివారిపల్లె వాటర్‌షెడ్ పరిధిలో మూడు గ్రామ పంచాయ తీల్లో 57 నీటి నిల్వ కుంటల నిర్మాణాలకు గాను రూ.1.07 కోట్లు ఖర్చుపెట్టారన్నారు. కాగా పొలంగట్ల నిర్మాణ పనుల్లో 6చోట్ల కొలతల్లో వ్యత్యాసం ఉందని సోషల్ ఆడిట్ బృందం తేల్చింది. దీనిపై సంబంధిత వ్యక్తుల నుంచి రూ.12,470 రికవరీ చేయాలని పీడీ ఆదేశించారు. వాటర్‌షెడ్ కమిటీలోని 483 మంది రైతులకు సబ్సిడి కింద పంపిణీ చేసిన పనిముట్లు, సోలార్ గ్రిడ్‌ల పనితీరును సామాజిక బృందం వెల్లడించింది. కార్యక్రమంలో అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి ప్రకాశ్, వాటర్‌షెడ్ ఏపీడీ లక్ష్మీనరస య్య, సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పీ నీలకంఠ, వాటర్‌షెడ్ జేఈ విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 23: ఎన్‌ఆర్‌జీఎస్ ఉపాధి హామీ పనులను ఉద్యాన రైతులు సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ ఎంసీ మద్దిలేటి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వలసపల్లె పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పీడీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన తోటల్లో మొక్కలు చుట్టూ ట్రెంచి తవ్వకాలను ఉపాధి పనుల కింద చేసుకోవచ్చన్నారు. ముఖ్యంగా పూలతోటలు, పళ్లతోటల పనులను ఉపాధిపథకంలో చేర్చారని వాటిని రైతులు ఉపయోగించుకోవాలన్నారు. దీంతో పాటు పొలాల్లో నీటి సంరక్షణ పనులు(ఫారం పాండ్) చేపట్టి నీటి నిల్వ చేసే పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ మధుబాబు, ఏపీవో సుబ్రమణ్యం, టీఏ హరీష్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.